www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!

వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

: 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar**

హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 251 | శుక్రవారం | 28 ఫిబ్రవరి, 2025




దేవాదాయశాఖ పరిధిలోకి

## చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం

ఆలయం లెక్కలు చెప్పాల్సిందే..!

02



## ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం

- కుంభమేళాతో ప్రపంచమే ఆశ్చర్య పోయింది
- ఎవరికైనా అసౌకర్యం కలిగితే క్షమించండి
- కుంభమేళా ముగింపుపై మోడీ వెల్లడి

ప్రయాగ్ రాజ్‌లో 45 రోజుల పాటు జరిగిన మహా కుంభమేళా ఘనంగా ముగిసింది. మహాకుంభ మేళా ముగింపును పురస్కరించుకుని ప్రధాని మోడీ దేశ ప్రజలకు సందేశమిచ్చారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని ఐక్యత మహాకుంభ్‌గా అభివర్ణించారు.

04



మెట్రోను అడ్డుకున్నట్లు

## రుజువు చేస్తారా?

- కేంద్రాన్ని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారా?
- సీఎం రేవంత్ స్థాయిని మరిచి విమర్శలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్

03

# తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు

వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ




- దేశ విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు సాధించాం
- హెచ్‌సీఎల్ టెక్ క్యాంపస్ ప్రారంభించిన సీఎం రేవంత్

**ప్రజానావ, హైదరాబాద్:** దేశంలోనే తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరని, 2025వ సంవత్సరంలోనే దేశ విదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు సాధించామని, తెలంగాణ వన ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. ఇవి, బయోటెక్ సహా తదితర రంగాల్లో హైదరాబాద్ అగ్రగామిగా ఉందని ప్రశంసించారు.

మిగతా 2 లో



ప్రాజెక్టుల బాధ్యత

## కిషన్ రెడ్డిదే

- అనేకమార్లు కేంద్రానికి నివేదించాం
- పదేళ్లలో కాలయాపన చేసిన బీఆర్ఎస్
- మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు

**ప్రజానావ, సిద్దిపేట:** తెలంగాణలోని ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న తమ నాయకుడిని బీఆర్ఎస్ పార్టీ సంప్రదించలేదని రాష్ట్రానికి ఏం కావాలో అడగలేదని.. ప్రధాని వస్తే కేసీఆర్ కలవడంలేదని ఏదేదో చెప్పి కాలం గడిపారని చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని చాలాసార్లు కలిసి అడిగామని గుర్తుచేశారు.

మిగతా 2 లో

మరో వివాదంలో

## ఇన్ఫోసిస్




02

- 400మంది ఉద్యోగుల తొలగింపు
- కార్మిక సంఘాల ఆందోళన
- ప్రధాని కార్యాలయానికి ఫిర్యాదు

## వీడని ఉత్కంఠ

- ఎస్ఎల్‌బీసీ వద్ద వేగంగా కొనసాగుతున్న బురద తొలగింపు చర్యలు

**ప్రజానావ, మహబూబ్‌నగర్:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో పేరుకుపోయిన బురదను తొలగించే ప్రక్రియ షురూ అయింది. గురువారం నాడు సహాయక చర్యల్లో భాగంగా ఒక వైపు డీ వాటరింగ్ చేస్తూ, మరో వైపు బురదను లోకో ట్రైన్ ద్వారా బయటికి తీసుకువస్తున్నారు. టీబీఎం మిషన్ సమీపంలో పడి ఉన్న సామాగ్రిని కూడా తరలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయితే తప్ప సహాయక చర్యలు చేపట్టే అవకాశం లేదని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. బురద తొలగించే పనులను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌లు పర్యవేక్షిస్తున్నారు. సొరంగం నుంచి పెద్ద ఎత్తున బురద

మిగతా 2 లో



## మహిళలకు భరోసా కల్పించాలి



- ప్రభుత్వం, పోలీసులు, ప్రజలకూ బాధ్యత ఉంది
- పుణె అత్యాచార ఘటనపై మాజీ సీజేఐ చంద్రచూడ్

04

## కృష్ణాజలాల్లో తాగునీటికే ప్రాధాన్యం

- ఇరు రాష్ట్రాలు జాగ్రత్తగా వాడుకోవాలి
- కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయం

02



## రాజకీయాలకు ఓ హద్దు ఉండాలి

- కొండగట్టు, మాసాయిపేట ఘటనలు మరిచారా?
- శ్రీశైలం పవర్ ప్లాంట్ అగ్నిప్రమాదంలో ఆరుగురు మృతి గుర్తుందా?
- హరీష్ రావు రాజకీయాలపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్

02



## ఎస్ఎల్‌బీసీ ఘటనపై బాధ్యతారాహిత్యం

- సహాయక చర్యల్లో ఘోరంగా వైఫల్యం
- ప్రచారాల మీద ఉన్న శ్రద్ధ ప్రాణాల మీద లేదు
- హెలికాప్టర్ షోలకే సీఎం పరిమితం : మాజీ మంత్రి హరీశ్‌రావు



03

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

2 శుక్రవారం 28 ఫిబ్రవరి 2025


# తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు

మొదటి పేజీ తరువాయి

మాదాపూర్‌లో హెచ్‌సిఎల్ టెక్ నూతన క్యాంపస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రసంగించారు. నూతన హెచ్‌సిఎల్ క్యాంపస్ ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా మారిందని కొనియాడారు. దేశంలోనే తెలంగాణ, హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం ఏడాదిలోనే దేశవిదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఉద్యోగ కల్పనలో నంబర్‌వన్‌గా నిలిచామని చెప్పారు. ఈ విషయాన్ని గర్వంగా చెబుతున్నానన్నారు. 'తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని నేను చెప్పినప్పుడు అది సాధ్యం కాదని కొందరన్నారు. రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ.41,000 కోట్లు, రూ.1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై సంతకాలు చేసుకున్న తరువాత ఇప్పుడు అది సాధ్యమని నమ్ముతున్నారు. తెలంగాణ రైజింగ్‌ను




ఎవరూ ఆపలేరు. మా పోటీ ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, చెన్నైతో కాదని నేను చెప్పినప్పుడు.. కొంతమంది అది పెద్ద కలనే అవుతుందన్నారు. ఈవీ అడాప్షన్‌లో హైదరాబాద్‌ను నంబర్ వన్‌గా చేశాక.. రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, స్కిల్స్, మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ హబ్‌గా మారుస్తున్నాం. ఇప్పుడు హైదరాబాద్ రైజింగ్ ఆగదు అని ప్రజలు అంటున్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన ఆమ్జెన్‌ను ఇటీవలే ప్రారంభించాం. ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాల్లో ఒకటైన బయో ఆసియా సదస్సును నిర్వహించాం. గ్లోబల్ కంపెనీగా హెచ్‌సీఎల్ టెక్ దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఇది 2.2 లక్షల మందికిపైగా ఉద్యోగులతో 60 దేశాల్లో ఆపరేట్ చేస్తోంది. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్ క్రియేట్ చేస్తున్నారు. 2007లో హైదరాబాద్‌కు వచ్చినప్పటి నుంచి హెచ్‌సీఎల్ అంచలంచెలుగా పెద్ద స్థాయికి ఎదిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాబు, సెక్రటరీ జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

# దేవాదాయశాఖ పరిధిలోకి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం

**ప్రజానావ, హైదరాబాద్ :** పాతబస్తీలోని ఛార్మినార్‌ను ఆనుకుని ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం అంటే తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ హిందువుకూ ఓ సెంటిమెంట్. మైనార్టీలు అధికంగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటైన ఆలయం కావడం వల్లనో, లేక కోరిన కోర్కెలు తీర్చే మహిమగల దేవతగా పేరొందడం వల్లనో, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం దర్శానికి నిత్యం భక్తులు భారీగా తరలివస్తుంటారు. అంతేకాదు బీజేపీ కేంద్ర పెద్దలు అమిత్ షా, నడ్డా వంటి కీలక నేతలు సైతం హైదరాబాద్ వచ్చారంటే తప్పకుండా ఛార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోకుండా వెళ్లరు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం బీజేపీ నేతలకు ఆనవాయితీగా వస్తోంది. అంతేకాదు ఇటీవల కాలంలో పొలిటికల్ పార్టీల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లకు, ప్రమాణాలకు భాగ్యలక్ష్మి ఆలయం వేదికగా మారింది. అంతలా హిందువుల సెంటిమెంట్ ఈ ఆలయంతో పెనవేసుకుని ఉంది. హిందూ, ముస్లింల ఐక్యతతోపాటు, మత విద్వేషాలు చెలరేగకుండా చూడాల్సిన సున్నితమైన ప్రదేశం కూడా ఈ భాగ్యలక్ష్మి ఆలయం. ఇంతలా ప్రధాన్యత ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం తాజాగా దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లనుంది. ఇకపై హైదరాబాద్ పాతబస్తీలో చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ నిర్వహణ దేవాదాయశాఖ పరిధిలోకి రానుంది. ఈ మేరకు దేవాదాయ శాఖను ట్రైబ్యూనల్ ఆదేశిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. భాగ్యలక్ష్మి ఆలయ చరిత్ర గురించి మాట్లడుకుంటే..1960 సంవత్సరంలో చార్మినార్ వద్దనున్న ఈ అమ్మవారి ఆలయ పరిధిలో బస్సు ప్రమాదం జరగడంతో అమ్మవారి విగ్రహం కూలిపోయింది. స్థానిక భక్తులు విరాళాలు సేకరించి అమ్మవారి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించారు. అంతకుముందు పోచమ్మ పేరుతో ఉన్న అమ్మవారి పేరును అప్పటి నుంచి భాగ్యలక్ష్మి అమ్మవారిగా మార్చారు. అలా నాటి నుంచి ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసే మహంత్ రామ్‌చంద్ర దాసు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్ మోహన్ దాసు అనే వ్యక్తిని పూజారిగా నియమించారు. టెంపుల్ ట్రస్టీ మీద గతంలో ఉన్న సుప్రీంకోర్టు తీర్పు కారణంగా హెరిడెటరీ ట్రస్టీ ఆర్డర్స్‌తో ఆలయాన్ని తన ఆధీనంలోకి తీసుకొని ఆదాయాన్ని రాజ్ మోహన్‌దాసు ఒక్కరే అనుభవిస్తూ వచ్చారు. దీనిపై మహంత్ రామ్‌చంద్ర దాసు కుమార్తె భాగ్యలక్ష్మి ఆలయం అజామాయిషీ చేస్తున్న వారిపై కోర్టును ఆశ్రయించారు. కోట్లాది రూపాయాల ఆలయ నిధులను ప్రస్తుత నిర్వహకులు దుర్వినియోగం చేస్తున్నట్టు సాక్షాధారాలను కూడా ట్రబ్యునల్ దృష్టికి తీసుకెళ్లడంతో భాగ్యలక్ష్మి ఆలయాన్ని దేవాదాయ శాఖకు అప్పగించాలని తాజాగా తీర్పు ఇచ్చినట్టు దేవాదాయశాఖ అధికార వర్గాల సమాచారం. ప్రస్తుతం ఉన్న భాగ్యలక్ష్మి ఆలయ నిర్వహణ బాధ్యతను మహంత్ మనోహర్ దాసు, మహంత్ రామ్‌చంద్రదాసు నుంచి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోనుంది. 1960 దశకం నుంచి వీరు ఆలయ నిర్వహణ భాధ్యతలు చూస్తున్నారు. ఇప్పుడు నిర్వహణ బాధ్యతలను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఆలయానికి తక్షణమే ఈఓను నియమించి ఆలయంలో ఎటువంటి అవకతవకలులేకుండా , అభివృద్దిలో ముందుకు తీసుకు వెళ్ళాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ట్రిబ్యునల్ ఆదేశించింది. ఈ ఆలయ ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదులపై కోర్టు విచారణ అనంతరం ఈ ఆదేశాలు జారీ అయినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. అంతేకాదు ఇప్పటి వరకూ ఆలయ ఆదాయం, ఖర్చులు ఇతర వివరాలను సేకరించడంతోపాటు భక్తుల విరాళాలు, నిధుల దుర్వినియోగంపై విచారణ జరపడంతోపాటు, ఒకవేళ అవకతవకలు జరిగితే తగిన చర్యలు తీసుకోవాలని ట్రిబ్యునల్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# మరో వివాదంలో ఇన్ఫోసిస్

**న్యూఢిల్లీ:** ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఇటీవల మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ కంపెనీకి చెందిన మైసూరు క్యాంపస్‌లో దాదాపు 400 మంది ట్రైనీ ఉద్యోగులను విధుల్లో నుంచి తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై కార్మిక యూనియన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా ఈ వ్యవహారం ప్రధానమంత్రి కార్యాలయానికి చేరింది. ఈ బలవంతపు లేఆఫ్‌ల పై ట్రైనీలు పీఎంఓకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తొలగింపులపై ప్రధానమంత్రి కార్యాలయం లో 100కు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు కథనాలు తెలిపాయి. ఈ విషయంలో జోక్యం చేసుకుని తమ ఉద్యోగాలను తిరిగి ఇప్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి తొలగింపులు జరగకుండా చూడాలని ట్రైనీలు కోరినట్లు తెలుస్తోంది. దీంతో కేంద్ర కార్మిక శాఖ స్పందించి చర్యలు చేపట్టినట్లు సమాచారం. దీనికి సంబంధించి కర్ణాటక కార్మిక శాఖకు ఫిబ్రవరి 25నే నోటీసులు పంపించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర కార్మిక శాఖ అధికారులు దర్యాప్తు జరిపి కేంద్రానికి నివేదిక ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి ఆరంభంలో మైసూరు క్యాంపస్‌లోని దాదాపు 400 మందిని ట్రైనీలకు ఇన్ఫోసిస్ లేఆఫ్‌లు ప్రకటించింది. ఉన్నపళాన క్యాంపస్‌ను వీడాలని అల్టిమేటం జారీ చేసినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై ఇన్ఫోసిస్ ఆ తర్వాత స్పందించింది. వరుసగా మూడు ఎవాల్యుయేషన్ పరీక్షల్లో విఫలమవడంతో వారిని తొలగించినట్లు వెల్లడించింది. ఈ పరీక్షలు సంస్థ నిబంధనల్లో భాగమేనని, కంపెనీ పురోగతికి కూడా ముఖ్యమని పేర్కొంది. 2022-23 నియామక ప్రక్రియలో భాగంగా 2000 మంది ఫ్రెషర్లను ఇన్ఫోసిస్ ఎంపిక చేసింది. సిస్టమ్ ఇంజినీర్, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజినీర్ తదితర పోస్టులకు ఎంపిక చేస్తూ, వారికి అదే ఏడాది ఆఫర్ లెటర్లు ఇచ్చింది. వారంతా 2022 బ్యాచ్ ఉత్తీర్ణులు. అన్ని రకాల పరీక్షలను పూర్తి చేసినా వీరిని విధుల్లోకి తీసుకోవడంలో మాత్రం ఆలస్యం చేస్తూ వచ్చారు. దీంతో కంపెనీపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో పాటు కార్మిక శాఖ వద్ద ఫిర్యాదు సైతం నమోదైంది. ఈ క్రమంలో రెండేళ్లు ఆలస్యంగా 2024 ఏప్రిల్‌లో వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంది. అయితే, గతేడాది మైసూరు క్యాంపస్‌లో ట్రైనీలుగా చేరిన వారిలో సగం మందిపై ఇన్ఫోసిస్ వేటు వేయడం గమనార్హం.

# కృష్ణాజలాల్లో తాగునీటికే ప్రాధాన్యం

**ప్రజానావ, హైదరాబాద్:** తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ రెండు రాష్ట్రాల్లో ఉన్న పంటలను దృష్టిలో ఉంచుకొని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో బోర్డు ప్రత్యేక సమావేశం హైదరాబాద్ జలసౌధలో జరిగింది. తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇంజనీర్లు సమావేశానికి హాజరయ్యారు. రెండు జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకునే విషయమై సమావేశంలో చర్చించారు. మే నెలాఖరు వరకు తమకు 63 టీఎంసీలు కావాలని తెలంగాణ, 55 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సీఈల సమావేశం అనంతరం వివరాలు సమర్పించాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో కనీస వినియోగ మట్టానికి ఎగువన 60 టీఎంసీలకు పైగా నీరు ఉంది. ఉన్న కొద్ది పాటి నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని బోర్డు రెండు రాష్ట్రాలకు సూచించింది. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, ఉన్న పంటలను దృష్టిలో పెట్టుకొని మిగిలిన నీటిని ప్రణాళికతో వాడుకోవాలని తెలిపింది. పక్షం రోజులకు ఒకసారి పరిస్థితులను

# ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారంపై ప్రభుత్వం చొరవ

## ఎమ్మార్ ప్రతినిధులతో సీఎం రేవంత్ సమీక్ష



**ప్రజానావ, హైదరాబాద్:** ఎమ్మార్ ప్రాపర్టీతో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. వారి న్యాయకమిటీ అందించే సూచనలు,సలహాలు స్వీకరిస్తామని తెలిపింది. వివిధ కేసులతో పెండింగ్‌లో ఉన్న తమ ప్రాజెక్టుల వివాదాలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్ ప్రాపర్టీస్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మార్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎమ్మార్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అలబ్బర్, భారత్ లో యూఏఈ మాజీ రాయబారి డాక్టర్ అహ్మద్ అల్ బన్నా, ఎమ్మార్ గ్రూప్ సీఈవో అమిత్ జైన్, ఆ కంపెనీ ఇంటర్నేషనల్ హెడ్ ముస్తఫా అక్రమ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి,పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి, ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2001లో ఉమ్మడి రాష్ట్రంలో దుబాయ్‌కు చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ హైదరాబాద్లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, గోల్ఫ్ కోర్సు, విల్లాలు తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ఏపీఐఐసీతో ఆ సంస్థ చేసుకున్న ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. ఏజెన్సీల దర్యాప్తులు, కోర్టుల్లో విచారణలు కొనసాగుతున్నాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2015 అక్టోబర్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మార్ ప్రాపర్టీస్ కు సంబంధించిన ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ఛీఫ్ సెక్రెటరీ సారథ్యంలో అయిదుగురు సెక్రెటరీల కమిటీని ఏర్పాటు చేసింది. మరోవైపు కేంద్ర విదేశాంగశాఖ, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాకూడా ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఎమ్మార్ ప్రతినిధులతో జరిగిన చర్చల సందర్భంగా ఈ అంశాలన్నింటినీ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. వివిధ దర్యాప్తు ఏజెన్సీల కేసులు, ఛార్జ్ షీట్లు, న్యాయపరమైన అంశాలతో ముడిపడి ఉన్నందున ఎమ్మార్ ఒప్పందాల డాక్యుమెంట్లు, కోర్టు కేసుల వివరాలతో పాటు కేంద్ర ప్రభుత్వ సూచనలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు 2015లో చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి అదనంగా న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. న్యాయ వివాదాలను అధ్యయనం చేయడానికి, సామరస్య పూర్వక పరిష్కారం చేసుకోవడానికి యూఏఈ ప్రభుత్వ ఆమోదంతో ఒక లీగల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని సంస్థ ప్రతినిధులు ప్రతిపాదించగా, వారి ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమోదించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీ వారితో సంప్రదింపులు జరిపి తదుపరి సూచనలు, సలహాలు అందిస్తుందని చెప్పారు.

# ఎస్ఎల్‌బీసీ వద్ద వీడని ఉత్కంఠ

మొదటి పేజీ తరువాయి

బయటకు తీస్తున్నారు. లోకో ట్రైన్ వెళ్లి రావడానికి గంట సమయం పడుతుంది. పెద్ద ఎత్తున కూలీలను ఉపయోగించి.. లోపల హిట్యాచి ద్వారా బురదను బయటికి తకలిస్తున్నారు. భారీ యంత్రం సహాయంతో వీటిని తీసి టిప్పర్‌లలో తరలిస్తున్నారు. ఈరోజు మొత్తం ఇదే కార్యక్రమం సాగుతుందని.. బురద తీసాక పరిస్థితిని అంచనా వేసి లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడం ఎలా అనేదానిపై ఒక ప్రణాళిక సిద్ధం చేస్తామని చెబుతున్నారు. ఒక వైపు బురద తొలగిస్తూనే మరో వైపు టీబీఎం మిషన్‌ను చిన్న చిన్న బాగాలుగా కట్ చేస్తున్నారు. ఈ భాగాలను కూడా వేరుచేసి బయటకు తీస్తున్నారు. ముందుగా రెండుకిలోమీటర్ల వద్ద బురదను క్లియర్ చేస్తున్నారు.

# రాజకీయాలకు ఓ హద్దు ఉండాలి

## హరీష్ రావు రాజకీయాలపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్



**ప్రజానావ, దోమలపెంట:** రాజకీయం చేయడానికో హద్దు ఉండాలని హరీష్ రావుకు మంత్రిఉత్తమ్ కుమార్ రెడ్డి చురకలు అంటించారు. టన్నెల్ వద్ద సహాయక చర్యలు జరుగుతుంటే రాజకీయం చేస్తారా అని మండిపడ్డారు. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కొండగట్టు బస్సు ప్రమాదంలో 62 మంది చనిపోతే.. నాడు కేసీఆర్ వెళ్లలేదు. కేసీఆర్ ఫామ్‌హౌస్ దగ్గర్లోనే మాసాయిపేట రైలు ప్రమాదం జరిగింది. రైలు ప్రమాదంలో చిన్నారులు చనిపోతే కేసీఆర్ కనీసం పరామర్శించలేదు. గతంలో శ్రీశైలం పవర్ ప్లాంట్ అగ్ని ప్రమాదంలో ఆరుగురు ఉద్యోగులు చనిపోతే కనీసం వెళ్లి చూడలేదు. పాలమూరు పంప్‌హౌస్‌లో ప్రమాదం జరిగి ఆరుగురు చనిపోతే స్పందించలేదు. ఇప్పుడేమో ప్రమాదం జరిగిన చోట రాజకీయం చేయడానికి హరీశ్‌రావు వచ్చారు. హరీశ్‌రావుకు అనుభవం ఉంటే పదేళ్లలో ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. నిపుణుల చర్యలకు ఇబ్బంది కావొద్దని అందరినీ లోపలికి పంపట్లేదు. టీబీఎం వెనుక ఉన్న బురద తొలగింపు పనులు జరుగుతున్నాయి. బురద తొలగింపు పూర్తికాగానే మిషన్ శిథిలాలు తొలగిస్తాం అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలు రెండ్రోజుల్లో పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రెండు నెలల్లో తిరిగి సొరంగం తవ్వకం పనులు చేపడతామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. టన్నెల్ కూలిపోవడానికి గత ప్రభుత్వ వైఫల్యమేనని ఉత్తమ్ ఆరోపించారు. గత ప్రభుత్వం టన్నెల్‌లో నీటి తొలగింపు పనులు కూడా చేపట్టలేదు. టన్నెల్‌లో నీటిని తోడివేసి ఉంటే.. ఇప్పుడీ ప్రమాదం జరిగేది కాదు. గ్రావిటీ ద్వారా 30 టీఎంసీలు తీసుకునే ప్రాజెక్టును పక్కకు పెట్టారు. టన్నెల్ పూర్తి చేసి ఉంటే 4.50 లక్షల ఎకరాలకు నీళ్లు అందేవని అన్నారు.. భారాస చేపట్టిన ప్రాజెక్టులన్నీ వాళ్ల జేబులు నింపుకొనేందుకే. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం కడితే అది మూడేళ్లకే కూలిందని గుర్తు చేశారు. .

# తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

## 3న ఓట్ల లెక్కింపు.. ఫలితాల ప్రకటన

**ప్రజానావ, హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లో ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం జరిగిన పోలింగ్ పక్రియ ముగిసింది. ఆంధ్రప్రదేశ్ లో 3, తెలంగాణలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే, సాయంత్రం 4 గంటల వరకు క్యూ లైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఏపీలో 2 గ్రాడ్యుయేట్, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ సమయం ముగిసే నాటికి పశ్చిమ గోదావరి జిల్లాలో 65.43 శాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖపట్నం జిల్లాలో 87.30 శాతం పోలింగ్ నమోదు అయింది. ఎన్‌టీఆర్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 61.99 శాతం నమోదు అయింది. మరోవైపు, తెలంగాణలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ముగిసింది. ఉమ్మడి కరీంనగర్- మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 40.61 శాతం, ఇవే జిల్లాల్లో జరుగుతున్న టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 63.49 శాతం పోలింగ్ నమోదు కాగా, వరంగల్- నల్లగొండ- ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 76.35 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. కాగా, వచ్చే నెల 3వ తేదీన తుది ఫలితాలను ఎన్నికల కమిషన్ వెల్లడించనుంది.

# నిర్మాత కేదార్ మృతిపై అనుమానాలు

**ప్రజానావ, హైదరాబాద్ :** సినీ నిర్మాత కేదార్ చుట్టూ తెలంగాణ రాజకీయం తిరుగుతోంది. దుబాయ్‌లో ఉన్న కేదార్ సెలగం శెట్టి అనుమానాస్పద స్థితిలో చనిపోయారు. ఫిబ్రవరి 25న తన ఫ్లాట్‌లో నిద్రలోనే చనిపోయారు కేదార్. దీంతో ఆయన మృతిపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. మూడు రోజులైనా కేదార్ మృతదేహం ఇండియాకు తీసుకురాలేదు. కేదార్ మృతిపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. కుటుంబ సభ్యులు కోరితే కేదార్ మృతిపై దర్యాప్తు జరిపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గత ఏడాది ర్యాడిసన్ డ్రగ్స్ కేసులో కేదార్ అరెస్ట్ అయ్యారు. ఆనంద్ దేవరకొండ నటించిన గం గం గణెళిశా చిత్రానికి ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు కేదార్. సెలబ్రిటీలకు, ఇతర రాజకీయ ప్రముఖులకు దుబాయ్‌లో ప్రాపర్టీస్ కొనుగోళ్లు, ఇతర వ్యాపారల్లో మధ్యవర్తిగా కేదార్ వ్యవహరించేవాడని సమాచారం.. ఈ క్రమంలో కేదార్ హఠాన్మరణం.. పలు అనుమానాలకు తావిస్తోంది.

# గూగుల్‌లో ఉద్యోగుల తొలగింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ తాజాగా ఉద్యోగుల తొలగింపు పక్రియ చేపట్టింది. క్లౌడ్ డివిజన్‌లోని ఉద్యోగుల సంఖ్యను తగ్గించిందని సమాచారం. సంబంధిత వ్యక్తులు ఈవిషయాన్ని వెల్లడించినట్లు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది. అయితే ఎంతమందిని తొలగించిందనే విషయం మాత్రం తెలియరాలేదు. వంద మందికి పైగా ఉండొచ్చని, అది కూడా కొన్ని టీమ్స్‌పై మాత్రమే తొలగింపుల ప్రభావం ఉందని తెలుస్తోంది. ఇదంతా కూడా ఖర్చు తగ్గించుకునే ప్రయత్నంలో భాగమని అంటున్నరు. కంపెనీ దీర్ఘకాలిక విజయాల కోసం వ్యాపారానికి కీలకమైన రంగాల్లో పెట్టుబడులు పెంచేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. అందులోభాగంగా కొన్ని మార్పులు చేస్తున్నామని గూగుల్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో అవకాశాల్ని అందిపుచ్చుకొనేందుకు అనేక సర్దుబాట్లు చేశామని వెల్లడించారు. మరోవైపు ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో గూగుల్ తన క్లౌడ్ వ్యాపారంలో ఆదాయ అంచనాలను అందుకోలేకపోయింది. 2025 మూలధన వ్యయాలు కూడా అంచనాలకు మించిపోయాయి. ఈనేపథ్యంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం గమనార్హం.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శుక్రవారం
28 ఫిబ్రవరి 2025


# మెట్రోను అడ్డుకున్నట్లు రుజువు చేస్తారా



- కేంద్రాన్ని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారా
- సీఎం రేవంత్ స్థాయిని మరిచి విమర్శలు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్

**న్యూఢిల్లీ:** ఎవరిని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారు.. ఎవరిని మీరు విమర్శిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మెట్రో రెండోదశను అడ్డుకున్నట్లు రుజువులు చూపాలని సవాల్ చేశారు. విస్తరణకు పైసా లేకున్నా పనులు ఎలా చేపడతారని కూడా ఎదురు ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. తాను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. సీఎంగా ఉన్న వ్యక్తి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకి సీఎం కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టం. కేంద్ర ప్రభుత్వానికి ఒక విధానం ఉంటుంది.. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తారు. రేవంత్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కేంద్రం నుంచి డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పారా?' అని కిషన్‌రెడ్డి నిలదీశారు. తెలంగాణకు సిఎం రేవంతా లేక తానా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మైనింగ్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. గనుల శాఖలో నూతన పాలసీ తీసుకొచ్చామని.. 12 ఖనిజాల రాయల్టీని పెంచామని తెలిపారు. ఈ ఏడాది జీఎస్ఐ 448 ప్రాజెక్టుల్లో గనుల అన్వేషణ చేపట్టిందని పేర్కొన్నారు. గనుల అన్వేషణలో ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వామ్యం చేస్తున్నామని.. ఇందులో భాగంగానే ఈ ఏడాది 12 ప్రైవేట్ కంపెనీలు గనుల అన్వేషణలో భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఆఫ్ షోర్ ఏరియాలో ఖనిజాల ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. పలు ఆఫ్ షోర్ మినరల్స్ గుర్తించి వేలం వేయబోతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 103 బ్లాకుల గనులను వేలం వేశాయని.. ఈ వేలం పక్రియలో 14 రాష్ట్రాలు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్??పై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డే అడ్డుకున్నారు. తన మిత్రుడు కేసీఆర్ పదేళ్లలో చేయని పని ఇప్పుడు చేస్తే రేవంత్‌రెడ్డికి పేరొస్తుందనే అలా చేశారని రేవంత్ ఆరోపించారు. నాకు రాష్ట్ర ప్రయోజనాల కంటే పేరు ముఖ్యం కాదు. కావాలంటే అనుమతులు, నిధులు తెప్పించి ఆ పేరును కిషన్‌రెడ్డినే తెచ్చుకోమనండి. నేను కూడా ఆయన పేరే ఊరూరా ప్రచారం చేస్తా. సన్మానం చేసి గండపెండేరం తొడుగుతా. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన 5 ప్రాజెక్టులకు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విన్నవించాం. వాటికి అనుమతులు, నిధులు తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లదే. లేకపోతే వారిద్దరూ గుజరాత్‌కో.. ఇంకో రాష్ట్రానికో వెళ్లిపోవాలి. తెలంగాణలో వారికి తిండి దండగ' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి కిషన్ రెడ్డి ఘాటుగా బదులిచ్చారు.

# ప్రాజెక్టుల బాధ్యత కిషన్ రెడ్డిదే

## మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు



**ప్రజానావ, సిద్దిపేట :** తెలంగాణలోని ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న తమ నాయకుడిని బీఆర్ఎస్ పార్టీ సంప్రదించలేదని రాష్ట్రానికి ఏం కావాలో అడగలేదని.. ప్రధాని వస్తే కేసీఆర్ కలవడంలేదని ఏదేదో చెప్పి కాలం గడిపారని చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని చాలాసార్లు కలిసి అడిగామని గుర్తుచేశారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అనే సంబంధాల దృష్ట్యా రాష్ట్రానికి అవసరమైన అన్ని ప్రాజెక్టులు అడుగుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం హుస్నాబాద్ టౌన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్రానికి రావాల్సిన ఏ ప్రాజెక్టు రాకపోయినా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటి వరకు మెట్రో మలిదశ , మూసీ, ఓఆర్ఓఆర్, ట్రిపుల్ ఆర్ , హైదరాబాద్ తాగునీటి సమస్య ఇతర కార్యక్రమాలకు సంబంధించి ఉపాధి అవకాశాలు మెరుగుపడే అంశాలకు సంబంధించి అనేకమైన ప్రాజెక్టులు కేంద్రానికి సమర్పించామని తెలిపారు. కేంద్రం తెలంగాణ రాష్ట్ర విభజనకు సంబంధించిన హామీలు నెరవేర్చాల్సి ఉందని అన్నారు. కిషన్ రెడ్డి రాష్ట్రానికి నిధులు తేకపోతే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ వేరు కాదని గమనించాల్సి వస్తోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ అని ముందు నుంచి చెబుతున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్‌గా తీసుకున్న కుల సర్వేపై మొదటి వారంలో శాసన సభలో చట్టం చేసి రాజకీయ విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చేసే తీర్మానాన్ని చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్రం ఎప్పుడైతే ఈబీసీకి సంబంధించి షెడ్యూల్లో మార్చుకున్నారో అదేవిధంగా దీనిని కూడా దాని మాదిరిగానే మార్చాల్సిందేనని.. రాజకీయ కారణం చూపిస్తే సరిపోదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గుజరాత్‌లో ప్రధాని మోదీ స్టేట్మెంట్ ఉంది దాని మాదిరిగానే రిజర్వేషన్లు ఇస్తున్నామని అన్నారు. కొంతమంది నేతలు తప్పుడు ప్రచారాలు చేసి మత పరమైన పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. పాకిస్తాన్ – ఇండియా అంటూ నేతలు రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. తమకు తెలంగాణ ప్రయోజనాలు ప్రజల అభివృద్ధి ముఖ్యమని స్పష్టం చేశారు. తమిళనాడులోఎన్ని రాజకీయ విభేదాలు ఉన్న అభివృద్ధి ప్రయోజనాలు విషయంలో అందరూ ఒక్క మాట మీదనే ఉంటారని చెప్పారు. తెలంగాణకు సంబంధించిన ప్రయోజనాల విషయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో కేంద్రంలో ఉన్న బీజేపీ కలిసి వచ్చి పెద్దన్న పాత్ర పోషించి నిధులు కేటాయించే ప్రయత్నం చేయాలని కోరారు. అది కేంద్ర ప్రభుత్వం బాధ్యతని.. లేదంటే తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మాజీ మంత్రి కేటీఆర్ మాటలు వింటే నవ్వువస్తోందని విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఓడిపోతే ట్వీట్ చేస్తున్నారు.. పంటలు ఎండిపోతే ట్వీట్ చేస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం తాగు, సాగు నీటికి చర్యలు తీసుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఎస్ఎల్‌బీసీ ఘటనపై సీఎం బాధ్యతారాహిత్యం

- సహాయక చర్యల్లో ఘోరంగా వైఫల్యం
- ప్రచారాల మీద ఉన్న శ్రద్ధ ప్రాణాల మీద లేదు
- హెలికాప్టర్ షోలకే సీఎం పరిమితం : మాజీ మంత్రి హరీశ్‌రావు



**ప్రజానావ, హైదరాబాద్:** ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు వెళ్లే ముందు హైదరాబాద్ హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ ఘటనలో సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని సాధించడంలో కూడా ప్రభుత్వం ఫెయిల్ అయిందని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బృందాలు, ఏజెన్సీ మధ్య సమన్వయం లోపించినట్టు కనిపిస్తుందన్నారు. వీరికి డైరెక్షన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయింది అని హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రులు అక్కడికి వెళ్లి హెలికాప్టర్లలో టీవీ ఇంటర్వ్యూలు ఇవ్వడానికి పోటీ పడుతున్నారు తప్ప, సహాయక చర్యలు చేపట్టడంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. పైనుంచి హెలికాప్టర్‌లో చూస్తే సొరంగం లోపల ఏమన్నా కనిపిస్తాదా, ప్రత్యేకంగా చూడడానికి వీఎక్స్ రే కెమెరాలు ఉన్నాయా? హెలికాప్టర్లలో చెక్కర్లు కొట్టుడు టీవీ ఇంటర్వ్యూలు ఏమిటో నాకు అర్థం కావడం లేదని తెలిపారు. వారి ప్రాణాలు కాపాడటానికి ప్రతి నిమిషం కూడా చాలా ముఖ్యమైనదని.. క్షణం కూడా చాలా విలువైనదని తెలిపారు. సొరంగం లోపల ఆహారం లేక తాగునీరు లేక చావు బ్రతుకుల మధ్య కొట్టాడుతున్నారని ఆదేవన వ్యక్తం చేశారు. వారి ప్రాణాల మీద రాష్ట్ర ప్రభుత్వానికి శ్రద్ధ కరువైందేమోనని అనిపిస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎనిమిది మంది ప్రాణాలు ముఖ్యమా? ఎన్నికల ప్రచారం ముఖ్యమా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కనీసం అక్కడికి వెళ్లి, ఒక డైరెక్షన్ ఇవ్వడంలో రేవంత్ రెడ్డి, నీటి పారుదల మంత్రి పూర్తిగా ఫెయిలయ్యారని ఆరోపించారు. తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి, ఇతరుల మీద నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

# ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్లనీయకుండా హరీశ్‌రావు అడ్డగింత

## రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ కార్యకర్తలు

**ప్రజానావ, మహబూబ్‌నగర్:** ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు వద్దకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్ రెడ్డితో పాటు పలువురు నేతలు చేరుకున్నారు. అయితే సొరంగంలోకి వెళ్లనీయకుండా హరీశ్‌రావు బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో హరీశ్‌రావు, ఇతర నాయకులు రోడ్డుపైనే బైఠాయించిన నిరసన తెలిపారు. పోలీసుల తీరుపై హరీశ్‌రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనను పరిశీలించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్ నుంచి గురువారం బయల్దేరిన సంగతి తెలిసిందే. కల్వకుర్తిలో బీఆర్ఎస్ నేతలతో కలిసి హరీశ్‌రావు టీ తాగారు. అనంతరం అక్కడ్నుంచి నేరుగా ఎస్ఎల్బీసీ సొరంగం వద్దకు చేరుకున్నప్పటికీ.. లోపలికి పోలీసులు అనుమతించడం లేదు. భారీగా పోలీసులు మోహరించారు. మీడియాపై కూడా పోలీసులు ఆంక్షలు విధించారు.

# రెండు, మూడు నెలల్లో టన్నెల్ పనుల పునఃప్రారంభం



- సహాయక చర్యల పూర్తికి యుద్ధప్రాతిపదికన చర్యలు
- జగన్‌తో అంటకాగి నీటి చౌర్యానికి సహకరించిన బిఆర్ఎస్
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడి

**ప్రజానావ, హైదరాబాద్ :** రెండు, మూడు నెలల్లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పునః ప్రారంభిస్తా మని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.రెండు మూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తి చేస్తామని అన్నారు.. పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ అనుమతుల గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. అప్పుడు మాట్లాడని నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఎందని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు మాటలు పూర్తి అబద్ధాలు, గొబెల్స్ ప్రచారమేనని విమర్శించారు. ఎస్ఎల్బీసీ ద్వారా 30 టీఎంసీలు గ్రావిటీ ద్వారా వస్తుంటే బీఆర్ఎస్ నేతలె పనులు వదిలిపెట్టి వెళ్లారని చెప్పారు. వాళ్లు సరైన పని చేసి ఉంటే తెలంగాణలో 30 టీఎంసీలు నీళ్లు వచ్చి మూడు నాలుగు లక్షల ఎకరాల నల్గొండ భూములు సాగులోకి వచ్చేవని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదాన్ని అందరికీ చూడటానికి అనుమతిస్తున్నామని చెప్పారు. వారి హయాంలో ఎన్ని ప్రమాదాలు జరిగినా ప్రతిపక్షంలో ఉన్న తమకు ఎలాంటి అనుమతులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వాళ్ల హయాంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చుపెట్టి నామమాత్రపు పనులు చేశారని మండిపడ్డారు. వాళ్ల హయాంలో నీటిపారుదుల శాఖను నిర్వీర్యం చేసిన ఘనత కేసీఆర్, హరీష్ రావులకు దక్కుతుందని చెప్పారు. తాము ప్రజాస్వామ్యతంగా పారదర్శకంగా ముందుకు పోతున్నామని చెప్పారు. వాళ్లు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం బ్లాస్ట్ జరిగి.. 9 మంది చనిపోతే ఒక్కరూ కూడా ఎందుకు పరామర్శకు రాలేదని ప్రశ్నించారు. ఆరోజు రేవంత్ రెడ్డి వస్తుంటే కారులో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని గుర్తుచేశారు. దేవాదులలో ఏడు మంది చనిపోతే.. అస్తిపంజరాలు ఐదేళ్ల తర్వాత దొరికాయని చెప్పారు. అప్పుడు హరీష్ రావు ఎప్పుడైనా ఆ విషయం గురించి మాట్లాడావా అని నిలదీశారు. ఎన్నో ప్రమాదాలు జరిగినప్పుడు వారి హయాంలో అడిగే నాథుడే లేరన్నారు. ఇక్కడికి వచ్చి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మీరు జగన్‌తో కుమ్మక్కై ప్రగతిభవన్‌లో విందులు, వినోదాలు చేసుకుంటుంటే జగన్ కృష్ణానదిని దోచుకువెళ్లారని విమర్శించారు.. పాలమూరు రంగారెడ్డిలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 27,500 కోట్లు ఖర్చుపెట్టి ఒక ఎకరాకు కూడా నీరందించలేదని ధ్వజమెత్తారు. ఎస్ఎల్‌బీసీకి కరెంట్ కట్ చేస్తే డీ ఓటరింగ్ చేయలేక పనులు ఆగిపోయాయని చెప్పారు. అప్పుడు జగదీశ్ రెడ్డి మంత్రిగా ఉన్నాడు ఏమి చేశారని ప్రశ్నించారు. తనకు హెలికాప్టర్‌లో తిరగాలని తనకు ఏ మాత్రం లేదని..తాను గతంలో పైలట్‌ను అని గుర్తుచేశారు. భారతదేశంలో టన్నెల్ ప్రమాదాల్లో అత్యంత నిపుణులను కలిగిన 11 ఏజెన్సీలను తీసుకువచ్చి సమర్థవంతంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు చెప్పిన మాటలు అబద్దాలు అని.. ఆ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

# పనులపై అవగాహన లేక ఇతరులపై నిందలు

## నిపుణులను సంప్రదించకుండానే ఎస్ఎల్‌బీసీ పనులు

## ఎస్ఎల్‌బీసీ ఘనటకు సీఎం రేవంత్‌దే పూర్తి బాధ్యత : కేటీఆర్

**ప్రజానావ, హైదరాబాద్:** సీఎంకు ఏపని ఎలా చేయాలో తెలియక ఇతరులపై ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. పదేళ్ల నాటి ప్రాజెక్టు పనులను నిపుణులను సంప్రదించకుండానే ప్రారంభించారని, 8 మంది కార్మికులు టన్నెల్ చిక్కుకోవడానికి అదే కారణమైందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఇతరులను నిందించడం మానుకుని పనిపైన దృష్టిపెట్టాలని సూచించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో 8 కార్మికులు చిక్కుకున్న ఘటనకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌ను నిందించడంపై కేటీఆర్ స్పందించారు. రేవంత్ రెడ్డికి పని చేతగాదని మండిపడ్డారు. 'ఆయనకు ఎలా పని చేయాలో తెలియకపోతే ఇతరులపై ఆరోపణలు చేయడం సులభంగా ఉంటుందని ఎద్దేవా చేశారు. పదేళ్ల కిందటి ప్రాజెక్టు పనులను నిపుణులను, ఇంజినీర్లను సంప్రదించకుండానే మొదలుపెట్టారని విమర్శించారు. అదే ఇప్పుడు 8 మంది కార్మికులు టన్నెల్‌లోపల చిక్కుకోవడానికి కారణమైంది' అని కేటీఆర్ ఆరోపించారు. కార్మికులు టన్నెల్ చిక్కుకుని ఇన్నిరోజులవుతున్నా ఇప్పటిదాకా వారి ఆచూకీ కనిపెట్టలేకపోయారని, వారి బతికున్నారో మరణించారో కూడా ఎవరికీ తెలియదని అన్నారు. రేవంత్ రెడ్డి ఇతరులపై నిందలు వేయడం మానుకుని పనిపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రవర్తన, మాటతీరు ముఖ్యమంత్రి లాగే ఉండాలని, చవకబారు మంత్రి లా ఉండకూడదని అన్నారు.



# నేడు కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి రాక

## గాంధీభవన్‌లో ఫ్లెక్సీల ఏర్పాటుకు నో

**ప్రజానావ, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల నూతన బాధ్యురాలుగా నిమితులైన మీనాక్షి నటరాజన్ శుక్రవారం హైదరాబాద్ రానున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఇకపై బ్యానర్లు, కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని ఆ పార్టీ నేతలతోపాటు కేడర్‌ను ఆదేశించింది. ఆమె నియామకం ఖరారు అయిన తర్వాత... తొలిసారిగా శుక్రవారం హైదరాబాద్ వస్తున్నారు.దీంతో ఆమెకు స్వాగతం పలికేందుకు పార్టీలోని నేతలంతా సమాయత్తమవుతోన్నారు. మీనాక్షి నటరాజన్.. హైదరాబాద్ వస్తున్న సందర్భంగా భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లు ఏర్పాటు చేయవద్దని.. అలాగే శాలువాలు, బోకేలు తీసుకు రావద్దంటూ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. గాంధీ భవన్ ఆవరణలో పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీతోపాటు రాహుల్ గాంధఈ ఫొటోలు మాత్రమే ఉండాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గాంధీ భవన్ ఆవరణలో ఉన్న ఇతర నేతల ఫొటోలు, కటౌట్లను సిబ్బంది తొలగించారు. ఇక మీనాక్షి నటరాజన్ రాకతో గాంధ భవన్ రూపు రేఖలు మారనున్నాయనే ఓ చర్చ సైతం ప్రారంభమైంది. మరోవైపు నేడు గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి మీనాక్షి నటరాజన్ హాజరుకానున్నారు. అలాగే పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు సీనియర్లు సైతం హాజరు కానున్నారు.తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలిగా ఇటీవల వరకు దీపా దాస్ మున్షి వ్యవహరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు కొత్త వ్యవహారాల బాధ్యులను నియమించారు. ఆ క్రమంలో తెలంగాణకు మీనాక్షి నటరాజన్‌ను నియమించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



## సంపాదకీయం




# వాణిజ్య పంటలకు మార్కెటింగ్ ఏదీ?!

రకరకాల వాగ్దానాలు.. పథకాలు.. రైతులను ఆదుకునేందుకు మద్దతు ధరలు.. ఇలాంటి ప్రకటనలతో ప్రభుత్వాలు ప్రకటనలు గుప్పించి అధికారంలోకి వస్తున్నా.. అన్నదాతల విషయంలో ఏ ప్రభుత్వం కూడా ముందుచూపుతో వ్యవహరించడం లేదు. దీనికంతటికి ఈ దేశంలో సమగ్ర వ్యవసాయ విధానం లేదు. ఏ పంటలు పండించాలి..ఏ పంటలు ఎగుమతి చేయాలన్న దానిపై పాలకులకు అవగాహన లేకుండా పోతోంది. రైతుల నుంచి సమాచారం వచ్చినా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా మనదేశంలో వరి, గోధుమ, జొన్నలు లాంటి తృణధాన్యాలతో పాటు వాణిజ్య పంటలకు కూడా అవకాశం ఉంది. మన నేతలు అన్ని పంటలకు అనువుగా ఉన్నాయి. ప్రధానంగా వాణిజ్య పంటలను విపరీతంగా పండించే ఛాన్స్ ఉంది. మిర్చి, పసుపు, పత్తి, అల్లం వెల్లుల్లి లాంటి పంటలను కూడా ఎగుమతులు చేసేలా పండించుకునే వీలుంది. రైతులు చెమటోడ్చి ఈ పంటలను ఏటా పండిస్తూనే ఉన్నారు. అయినా పంటల దిగుబడి రాగానే మద్దతు ధరల పేచీ.. ఎగుమతుల విధానంలో పేచీ... ఇలా సవాలక్ష కొర్రీలతో రైతులను ఆగం చేస్తున్నారు. ఇటీవల ఎపిలో మిర్చి పండించిన రైతులకు ప్రభుత్వాలు చుక్కలు చూపుతున్నాయి. తెలంగాణలో మిర్చితో పాటు పత్తి, పసుపు పంటలకు సకాలంలో గిట్టుబాట ధరలు రావడం లేదు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించి కబుర్లు చెబుతున్న సిఎం చంద్రబాబు మిర్చి సేకరణ విషయంలో పూర్తిగా విఫలం అయ్యారు. తెలంగాణలోనూ అదే పరిస్థితి. పండించిన పంటలను కొనుగోలు చేసి, పేదలకు తక్కువ ధరలకు అమ్మడం కూడా ఓ రకంగా ఆదుకోవడమే అవుతుంది. ఎగుమతులను పెంచుకోవడం ద్వారా రైతులకు అండగా నిలవవచ్చు. కానీ అలా జరగడం లేదు. ఎపిలో పీకల్లోతు కష్టాల్లో ఉన్న మిర్చి రైతులను బేషరతుగా ఆదుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టడం, రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూడడం కూడా తప్పే. ఇలాంటి సందర్భంలో ఎలా ఆదుకోవాలన్న ఆలోచన లేకుండాపోతోంది. లక్షల రూపాయలు పెట్టుబడి పెడితేగాని మిర్చి సాగు సాధ్యం కాదు. నారు నాటినప్పటి నుండి పంట చేతికివచ్చేంతవరకు మిర్చి రైతుది దినదిన గండం బతుకే! చీడ, పీడలు, తెగుళ్ల బెడద ప్రతిరోజూ వెంటాడుతున్నది. వీటన్నింటిని అధిగమించి యార్డు దాకా తెచ్చిన సరుకుకు నామమాత్రపు ధర కూడా పలకకపోతే సాగు చేసిన రైతు పరిస్థితి ఏమిటన్న ఆలోచన చేసేదెవరు. ఆదుకోవాలని కోరితే పండిన పంటలో పావు వంతే కొంటామనడం ఏ విధమైన ఊరడంపో అర్థం కాదు. మిగిలిన పంటను ఎవరికి అమ్ముకోవాలన్నది వారే చెబితే బాగుండేది. గత ఏడాది గరిష్టంగా క్వింటాకు 28 వేల రూపాయలు ధర పలికితే, ఇప్పుడు కేవలం 11,781 రూపాయల రేటు ఎలా నిర్ణయించారు. దీనికి ప్రాతిపదిక ఏమిటన్నద ఇపాలకులు వివరించాలి. అది కూడా నెలరోజుల వరకే కొంటామని చెప్పడం మరీ దారుణం. ఈ తరహా విధానాలు మిర్చి రైతాంగానికి పెనుశాపంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం మద్దతుగా ప్రకటించిన 11,781 రూపాయలను ప్రామాణికంగా తీసుకుని గత ఏడాది ధరలతో పోలిస్తే ఎకరాకు రెండు లక్షల రూపాయల నష్టం వస్తుందని రైతులు లెక్కలు వేసి చెబుతున్నారు. ఇంత ఘోరంగా పరిస్థితులు ఉంటే, రాష్ట్రంలో ఏ రైతు కూడా కష్టాల్లో లేరని ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగంలో గవర్నర్ చేత రాష్ట్ర ప్రభుత్వం చెప్పించడం మరీ దారుణం! ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం గుర్తించాలి. తక్షణం నాఫెడ్, మార్క్‌ఫెడ్‌లను రంగంలోకి దించి రైతాంగం కోరుతున్నట్లు క్వింటాకు కనీసం 20 వేల రూపాయల చొప్పున చెల్లించి, మొత్తం పంటను కొనుగోలు చేయాలి. అన్ని రకాల షరతులను ఎత్తివేయాలి. దీనికోసం అవసరమైతే కలిసివచ్చే శక్తులను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. పాలక కూటమికి రాజకీయంగా ఇబ్బంది అనుకుంటే రైతులను, అన్ని రాజకీయ పార్టీలను సమీకరించి కేంద్రం వద్దకు వెళ్లాలి. ఢిల్లీ పాలకుల మెడలు వంచి మిర్చి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి. ఒకసారి రైతు ఈ ధరకు పావు వంతు సరుకును అమ్మిన తరువాత మిగిలిన సరుకుకు ఎంత ధర పలుకుతుందో తెలియంది కాదు. ట్రేడర్లు అంతకన్నా తక్కువకే కొంటారు తప్ప ధరలు పెంచరు. నెలరోజుల గడువు ముగిసిన తరువాత మార్కెట్‌కు వచ్చే సరుకు పరిస్థితి ఏమిటన్న ఆలోచన కూడా చేయరంటే...వీరికి పంటలపై ఎలాంటి అవగాహన ఉందో తెలుసుకోవచ్చు. ఉదయం లేచింది మొదలు మార్కెట్ ఎకానమి సూత్రాలను వల్లించే కేంద్ర ప్రభుత్వ పెద్దలకు మార్కెట్ ఒడిదుడుకులు, పంటల గురించి అవగాహన లేదనుకోవాలి. లాభాల పంటను, రైతులకు నష్టాల మంటను మిగల్చడం కాక మరోటి కాదు. ఆర్థికంగా రాష్ట్రం అనేక కష్టాలు ఎదుర్కుంటుంటే వర్కింగ్ కేపిటల్‌ను ఏర్పాటు చేసుకోవాలనడం, ఖర్చులో సగభాగాన్ని రాష్ట్రమే భరించాలని కేంద్రం షరతులు పెట్టడం మరింత దుర్మార్గం. ఇంత నిర్దయగా కేంద్రం వ్యవహరించినా, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు పెదవి విప్పడానికి సైతం సిద్ధపడకపోవడం బాధాకరం! తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ తీరు, రైతులను ఆదుకనేలా లేదు. సొంతంగా పంటల కొనుగోలు విధానాలు అవలంబించాలి. గుంటూరు మిర్చి యార్డు నుండి చైనా, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండోనేషియా, థారులాండ్‌లకు మిర్చి ఎగుమతులు అత్యధికంగా జరుగుతాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం నుండి 1.79 లక్షల టన్నుల మిర్చిని చైనా దిగుమతి చేసుకుంది. వీటి విలువ 4,123 కోట్ల రూపాయలు! అయితే, అమెరికాతో అంటకాగే విధానాల్లో భాగంగా చైనాతో పాటు పలు ఇతర దేశాలకు చేసే ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టింది. ఫలితంగా ఎగుమతుల మార్కెట్ భారీ స్థాయిలో క్షీణించి, నిల్వలు పేరుకుపోయాయి. రైతాంగం ఆందోళన నేపథ్యంలో చైనాతో ఆర్డర్లను పునరుద్ధరించడానికి రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు ప్రయత్నించినప్పటికీ కేంద్రం నుండి సానుకూల స్పందన రాలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. సమగ్ర పంటల విధానం అవలంబించాలి. ఎగుమతులు దిగుమతులపై సమీక్షించాలి. అప్పుడే వ్యవసాయరంగం పురోగమించగలదు.

# ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం

- కుంభమేళాతో ప్రపంచమే ఆశ్చర్య పోయింది
- ఎవరికైనా అసౌకర్యం కలిగితే క్షమించండి
- కుంభమేళా ముగింపుపై మోడీ వెల్లడి



**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక 'మహాకుంభమేళా' ఘనంగా ముగిసింది. 45 రోజుల పాటు సాగిన ఈ కుంభమేళా విశేషాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బ్లాగ్‌లో రాశారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే గనుక అందుకు క్షమించాలని కోరారు. 'ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం అని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారా? అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ భక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాల కోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కన్పించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేను. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోదీ రాసుకొచ్చారు. ఈసందర్భంగా మహాకుంభమేళాను విజయవంతం చేసిన యూపీ ప్రభుత్వం, సహకరించిన ప్రయాగ్‌రాజ్ ప్రజలు, భక్తులకు మోదీ ధన్యవాదాలు తెలిపారు. 'ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా' అని మోదీ రాసుకొచ్చారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. సామాన్య పౌరులతో పాటు పలువురు రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిబ్రవరి 10, ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానం చేశారు.

# గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉద్రిక్తతలు



- మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీలో బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణలు
- ఒకరిపై ఒకరు రాళ్లురువ్వుకున్న కార్యకర్తలు.. పోలీసుల రంగ ప్రవేశం
- పరిస్థితిని సమీక్షించిన పోలీస్ కమిషనర్

**ప్రజానావ, మంచిర్యాల:** తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. కొన్ని చోట్ల ప్రశాంతంగా, మరి కొన్ని చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా నస్పూర్ మున్సిపాలిటీలోని తీగల్ పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఉద్రిక్తత పరిస్థితికి దారితీసింది. దీంతో బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ శ్రేణులు దూసుకెళ్ళాయి. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టి.. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించారు. స్థానిక ఎస్ఐ కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని స్థానిక బీజేపీ నేత కమలాకరరావు ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎస్ఐ బీజేపీ నేతపై దాడి చేశారంటూ బీజేపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. మరోవైపు కాంగ్రెస్ కార్యకర్తలు కూడా బీజేపీ శ్రేణులపై దూసుకువచ్చారు. దీంతో ఇరు వర్గాల మధ్య పరస్పరం వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. ఒక నొక దశలో పరిస్థితి చేజారి ఇరు వర్గాలకు చెందిన కార్యకర్తలు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సంఘటన ప్రదేశానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఎన్నికలను రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కను 69,134 మంది పట్ట భద్రులు, 5,693 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికారులు150 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పద్దతిలో ఓటింగ్ జరిగింది. ఎన్నికల విధుల్లో 1500 మంది సిబ్బంది, 2 వేల మంది పోలీసులతో బందోబస్త్ ఏర్పాటు చేశారు. మంచిర్యాల జిల్లాలో అత్యధిక ఓటర్లు ఉన్నారు. ఇక్కడ పురుష ఓటర్లు కీలకంగా ఉన్నాయి. అలాగే నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.





## వ్యాక్సిన్ దుష్ప్రభావంతో చనిపోయిన వారి సంగతేంటి

### వారికి పరిహారంపై కేంద్రం స్పందించాలి

### సుప్రీం ధర్మాసనం సూటి ప్రశ్న

**న్యూఢిల్లీ:** కోవిడ్ వ్యాక్సినేషన్ దుష్ప్రభావాల కారణంగా చనిపోయిన వారికి పరిహారంపై కేంద్రం స్పందించాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. కరోనా వ్యాక్సిన్ తీసుకున్న దేశ ప్రజల్లో కొందరు టీకా పడకపోవడంతో దుష్ప్రభావాల కారణంగా చనిపోయారు. ఇలా చనిపోయిన వారి బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు కేంద్రం ఏదైనా పాలసీ చేసిందో.. లేదో చెప్పాలని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అడిషనల్ సోలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటిని అడిగింది. కోవిడ్-19 వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత తన భర్త ఆరోగ్యం క్షీణించి చనిపోయాడని, తనకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కేరళకు మిసెస్ సయ్యద్ సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ సుప్రీంలో విచారణకొచ్చిన సందర్భంలో ఎక్స్‌గ్రేషియాపై కేంద్రం స్పందించాలని ఆదేశించింది.కరోనా సమయంలో? ఎమ్జ్ంగ÷న్సీ పేరుతో క్లినికల్ ట్రయిల్స్ లేకుండానే కొవిషీల్డ్ వ్యాక్సిన్‌కు కేంద్రం అనుమతి ఇచ్చిందని, దీంతో వ్యాక్సిన్ వేసుకున్న వారిలో దుష్ప్రభావం ఇప్పటికీ ఉందని అవేకెన్ ఇండియా మూమెంట్ ఆరోపించిన సంగతి తెలిసిందే. కొవిషీల్డ్ వ్యాక్సిన్ వేసుకున్న వారిలో గుండెపోటు, క్యాన్సర్, నరాల వ్యాధులు వంటివి వస్తున్నాయని అవేకెన్? ఇండియా మూవెంట్ ప్రతిధులు ఆరోపించారు. ఇప్పటికే చాలామంది మృతి చెందారని, వారికి కేంద్ర ప్రభుత్వంతో పాటు వ్యాక్సిన్ ?తయారీ సంస్థ నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వంతో పాటు వ్యాక్సిన్ ను ?ప్రమోట్? చేసిన సెలబ్రెటీలు కూడా సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

# మహిళలకు భరోసా ఉందన్న నమ్మకం కలిగించాలి

- ఎన్ని చట్టాలు చేసినా.. కఠినంగా అమలు చేయాలి
- ప్రభుత్వం, పోలీసులు, ప్రజలకూ బాధ్యత ఉంది
- పుణె అత్యాచార ఘటనపై మాజీ సిజెఐ చంద్రచూడ్



**ముంబై:** మహిళల రక్షణ కోసం తీసుకొచ్చిన చట్టాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని సుప్రీం మాజీ సిజె జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు.. ఎక్కడికి వెళ్లినా తాము సురక్షితంగా ఉన్నామనే నమ్మకాన్ని మహిళలకు కలిగించాలన్నారు. ఇలాంటి కేసుల్లో సరైన దర్యాప్తు, కఠిన చర్యలు అత్యంత కీలకం అన్నారు.. న్యాయవ్యవస్థ, పోలీసులకు పెద్ద బాధ్యత ఉంది. వీరితో పాటు సమాజానికి కూడా అంతే బాధ్యత ఉందని జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. మహారాష్ట్రలోని పుణెలో 26 ఏళ్ల యువతిపై బస్సులో ఓ దుండగుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన ప్రజల్లో ఆగ్రహానికి కారణమైంది. రాజకీయంగా దుమారం రేపుతోంది. దీనిపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు .నిర్భయ ఘటన తర్వాత చట్టాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. కేవలం చట్టాలతోనే అలాంటి ఘటనలను నివారించలేం.అందుకు ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు కూడా బాధ్యతతో వ్యవహరించాల్సి ఉందన్నారు. అత్యంత రద్దీగా ఉండే బస్ స్టేషన్‌లలో ఒకటైన స్వర్‌గేట్‌లో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తన స్వగ్రామానికి వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు చేరుకున్న యువతితో నిందితుడు మాటలు కలిపాడు. అక్క అని సంబోధిస్తూ నమ్మించాడు. గ్రామానికి వెళ్లే బస్సు మరో చోట ఉందని చెప్పి బస్ స్టేషన్‌లోనే దూరంగా ఎవరూ లేని చోట ఆగి ఉన్న మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్ దగ్గరకు ఆమెను తీసుకెళ్లాడు. బస్సులోకి వెళ్లేందుకు యువతి తటపటాయించడంతో లోపల ప్రయాణికులు ఉన్నారని.. నిద్రలో ఉండటంతో వాళ్లు లైట్లు వేసుకోలేదని నమ్మించాడు. బస్సులోకి యువతి ప్రవేశించగానే తలుపు వేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు దత్తాత్రయ రామదాస్ (36)గా పోలీసులు గుర్తించారు. అతడిపై అనేక కేసులు ఉన్నాయని, 2019 నుంచి బెయిల్ మీద ఉన్నాడని తెలిపారు. రామదాస్‌ను పట్టుకొనేందుకు 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అత్యాచారం జరిగిన ప్రాంతానికి 100 మీటర్ల దూరంలోనే పోలీస్ స్టేషన్ ఉండటం గమనార్హం. నిందితుడి గురించి సమాచారం ఇచ్చిన వారికి రూ.లక్ష రివార్డు ఇస్తామని పుణె పోలీసులు వెల్లడించారు. ఇక ఈ ఘటనపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే స్పందించారు. ఈ కేసుపై తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిసారించిందని, నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శుక్రవారం
28 ఫిబ్రవరి 2025


# ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



**ప్రజానావ, సిరిసిల్ల:** ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణం కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 374,375,376 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను, గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 371,372,373 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను, 187 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రం,



కోనరావుపేట మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 363,364 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాన్ని, 183 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రం, వీర్నపల్లి మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 385 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాన్ని, 192 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రం, గంభీరావుపేట మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 379,380 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను, 189 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రం, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 386,387 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను, 193 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రం, ముస్తాబాద్ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 381,382 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలను, 190 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సరళిని కలెక్టర్ పరిశీలించారు.

### ఎమ్మెల్సీ పోలింగ్ శాతం

జిల్లావ్యాప్తంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సాయంత్రము 4.00 గంటల వరకు 61.68 శాతం నమోదు అయింది. అలాగే టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ సాయంత్రము 4.00 గంటల వరకు 94.11 శాతం నమోదు అయింది.






## పట్టభద్రులు 68.51శాతం టీచర్లు 94.63 శాతం

**ప్రజానావ, సిరిసిల్ల:** పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ స్థానాల కోసం జిల్లా వ్యాప్తంగా 41 కేంద్రాలు ఏర్పాటు చేసి పోలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 677 మంది పురుషులు, 273 మంది మహిళా టీచర్లు మొత్తం 950 మంది ఉండగా, టీచర్స్ పురుషులు 640, మహిళలు 259 మంది మొత్తం 899 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 94.63 గా నమోదయింది. పట్టభద్రులు 13, 772 పురుషులు 8,625 మంది, మహిళలు మొత్తం 22,397 ఉన్నారు. వీరిలో 9,523 మంది పురుషులు 5,821 మంది మహిళలు మొత్తం 15,344 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 68.51 గా. నమోదయింది



## కన్నాయిగూడెంలో 94.73 శాతం

**ప్రజానావ,ములుగు/కన్నాయిగూడెం:** వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ కన్నాయిగూడెం మండలంలోని ప్రశాంతంగా ముగిసింది. ఓటు హక్కు కలిగిన ఓటర్లు గురువారం ఉదయం నుండే పోలింగ్ కేంద్రాల ముందు ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు తీరారు. ఓటు హక్కు వినియోగించుకోగా 94.73 శాతం ఓటింగ్ శాతం నమోదయింది.ఎన్నికలు పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం బుధవారం మధ్యాహ్నం వరకే పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ పత్రాలతో పాటు ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందిని ప్రత్యేక బస్సుల ద్వారా కేంద్రాలకు తరలించారని అన్నారు. గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎన్నిక సాయంకాలం నాలుగు గంటలు సమయంలో ముగిసింది. ఎన్నికలు జరుగుతున్న పరిస్థితులను కన్నాయిగూడెం ఎస్సై వెంకటేష్ పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కన్నాయిగూడెం ఏజెన్సీ ప్రాంత6 ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కన్నాయిగూడెం పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్ లను నల్గొండ జిల్లా కేంద్రానికి తరలించారని అన్నారు. ఏజెన్సీ మండలాల నుండి ప్రత్యేక వాహనాల ద్వారా బ్యాలెట్ పత్రాలను భారీ బందోబస్తు మధ్య నల్గొండ జిల్లా కేంద్రానికి తరలించారు. కన్నాయిగూడెం మండలంలో 19 ఓట్లు నమోదయ అని ఎస్సై తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కలిగిన ఓటర్లు అత్యధిక సంఖ్యలో ఓటును వినియోగించుకున్నారని ఎస్సై తెలిపారు.






## ములుగులో 92.83 శాతం

### పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ దివాకర్ టీఎస్

**ప్రజానావ, ములుగు ప్రతినిధి:** వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ నిర్వహించగా ములుగు జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఓటు హక్కు కలిగిన ఓటర్లు గురువారం ఉదయం నుండే పోలింగ్ కేంద్రాల ముందు ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు తీరారు. జిల్లాలో మొత్తం 628 మంది ఓటర్లు ఉండగా 583 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా 92.83 శాతం ఓటింగ్ శాతం నమోదయింది.ఎన్నికలు పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం బుధవారం మధ్యాహ్నం వరకే పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ పత్రాలతో పాటు ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందిని ప్రత్యేక బస్సుల ద్వారా జిల్లాలోని 9 మండల కేంద్రాలకు తరలించారు. గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎన్నిక సాయంకాలం నాలుగు గంటలు సమయంలో ముగిసింది. ఎన్నికలు జరుగుతున్న పరిస్థితులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లాలోని 09 పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న ఓటింగ్ సరళిని వీక్షించడం తో పాటు జిల్లా కేంద్రం లోని జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంను పరిశీలించారు. జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాటు చేసింది. ఎన్నికలు జరుగుతున్న సరళిని కలెక్టర్ తో పాటు అదరపు కలెక్టర్ సిహెచ్. మహేందర్ జి, ఆర్డిఓ వెంకటేష్ ఏజెన్సీ గ్రామాలలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్ లను నల్గొండ జిల్లా కేంద్రానికి తరలించాలని అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ మండలాల నుండి ప్రత్యేక వాహనాల ద్వారా బ్యాలెట్ పత్రాలను భారీ బందోబస్తు మధ్య నల్గొండ జిల్లా కేంద్రానికి తరలించారు. ములుగు మండలంలో 193 ఓట్ల గాను 180 మంది, వెంకటాపూర్ లో 40 మంది ఓటర్లకు గాను 35 మంది, గోవిందరావుపేట్ మండలంలో 108 ఓట్లకి గాను 102, తాడ్వాయి మండలంలో 65 ఓట్లు గాను 58 ఓట్లు పోలయ్యాయి. ఏటునాగారం మండలంలో 46 ఓట్ల గాను 44, కన్నాయిగూడెం మండలంలో 19 ఓట్లగాను 18, మంగపేట మండలంలో 95 ఓట్ల గాను 88, వాజేడు మండలంలో 33 ఓట్ల గాను 31 ఓట్లు, వెంకటాపురం మండలంలో 29 ఓట్ల గాను 27 ఓట్లు నమోదయ అని జిల్లా కలెక్టర్ తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కలిగిన ఓటర్లు అత్యధిక సంఖ్యలో ఓటును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.


















# వెళ్లొస్తాం రాజన్నా..

- స్వస్థలాలకు తిరిగి వెళ్తున్న భక్తులు
- మొక్కు చెల్లించినం.. సల్లంగచూడు తండ్రి
- కొనసాగుతున్న భక్తుల రద్దీ
- బద్దిపోచమ్మకు బోనం మొక్కులు
- ముగిసిన రాజన్న మహాజాతర



**ప్రజానావ, వేములవాడ:** మహాశివరాత్రి వేడుకలు మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా కొనసాగాయి. గురువారం ఉత్సవాలు ముగియడంతో భక్తులు తిరిగి స్వస్థలాలకు వెళ్తున్నారు. మూడు రోజుల క్రితం ముల్లెమూటలతో వేములవాడకు వచ్చిన భక్తులు ఆధ్యాత్మిక జరిలో మునిగితేలారు. బుధవారం రాత్రి జాగారం చేసి గురువారం ఉదయమే స్వస్థలాలకు బయలుదేరి వెళ్లారు. భక్తులు తిరిగి క్షేమంగా వెళ్లేందుకు ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్సు సర్వీసులను పెంచారు. గుడి చెరువుకట్టి కింది బస్టాండు నుంచి బస్సులను నడిపించారు. రాజన్న దర్శనానికి గురువారం ఉదయం సైతం భక్తులు భారీగా వచ్చారు. కోడెమొక్కులు, తలనీలాల సమర్పణ, నిలువెత్తు బెల్లం పంపిణీ చేశారు.



# ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు


## వేములవాడ ఆలయ కార్యనిర్వహణాధికారి వినోద్



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడలో మహా శివరాత్రి జాతర 2025 అత్యంత ఘనంగా, వైభవోపేతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా ఆలయ కార్యనిర్వహణాధికారి కె వినోద్ ధన్యవాదాలు తెలిపారు. సుమారు 2,55,675 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారన్నారు. మహా శివరాత్రి జాతరను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రికి, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, వివిధ శాఖల అధికారులందరికీ, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారికి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు.

## కార్యనిర్వహణాధికారి సన్మానం

జాతర నిర్వహణలో కచ్చితమైన దిశానిర్దేశం చేసి, సమైక్యంగా, సమిష్టి కృషితో మహా శివరాత్రి జాతర విజయవంతం చేసిన ఆలయ కార్యనిర్వహణాధికారి కె వినోద్ రెడ్డికి గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రొటోకాల్ ఏఈఓ జీ అశోక్ కుమార్, పర్యవేక్షకులు శ్రీకాంత్ చారి, సీనియర్ అసిస్టెంట్లు ఎడ్ల శివసాయి, పురాణం వంశ మోహన శర్మ, జూనియర్ అసిస్టెంట్ సింహాచారి, ఆలయ ఉద్యోగ బృందం పాల్గొన్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శుక్రవారం
28 ఫిబ్రవరి 2025




## పాకిస్థాన్, బంగ్లాదేశ్ మ్యాచ్ వర్షార్పణం

**రావల్పిండి:** ఛాంపియన్స్ ట్రోఫీని ఆతిథ్య పాకిస్థాన్ ఒక్క విజయం లేకుండా ముగించింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆ జట్టు మొదటి రెండు మ్యాచ్‌ల్లో ఓడి లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టింది. దీంతో బంగ్లాదేశ్‌తో చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచి పరువు కాపాడుకోవాలనుకున్న పాక్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. వర్షం కారణంగా పాక్, బంగ్లా మ్యాచ్ టాస్ పడకుండానే రద్దయింది. గురువారం రావల్పిండిలో ఉదయం నుంచి వర్షం కురిసింది. దీంతో మైదానమంతా చిత్తడిగా మారింది. ఔట్‌ఫీల్డ్ మొత్తం జలమయం అవడంతో మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాలేదు. టాస్ కూడా వేయకుండానే మ్యాచ్‌ను రద్దు చేసిన అంపైర్లు.. ఇరు జట్లకు చెరో పాయింటు కేటాయించారు. పాకిస్థాన్‌తోపాటు బంగ్లాదేశ్ ఒక్క విజయం లేకుండానే టోర్నీని ముగించింది. మరోవైపు.. గ్రూప్ ఎ నుంచి భారత్, న్యూజిలాండ్ ఇప్పటికే సెమీస్‌కు చేరాయి. ఆదివారం టీమ్ఇండియా, కివీస్ మధ్య జరిగే పోరులో గెలిచిన జట్టు గ్రూప్-ఎలో అగ్రస్థానంలో నిలుస్తుంది. రావల్పిండిలో మంగళవారం ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య జరగాల్సిన మ్యాచ్ కూడా వర్షార్పణమైన విషయం తెలిసిందే.



## ఆటగాళ్లను దూషించినట్లు వార్తలు..
### స్పందించిన పాకిస్థాన్ కోచ్

ఛాంపియన్స్ ట్రోఫీలో ఆతిథ్య పాకిస్థాన్ అవమానకరరీతిలో లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆ జట్టు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలై నాకౌట్‌కు చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. అన్ని విభాగాల్లోనూ ఆ జట్టు విఫలమైంది. దీంతో ప్లేయర్లపై అభిమానులు, మాజీ క్రికెటర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈనేపథ్యంలో పాకిస్థాన్ జట్టు తాత్కాలిక కోచ్ అకీబ్ జావేద్ బ్యాటర్లను పరుష పదజాలంతో దూషించినట్లు వార్తలొచ్చాయి. అయితే, వాటిని జావేద్ ఖండించాడు. తాను ఆటగాళ్లను అస్సలు తిట్టనని, అలాంటి సంస్కృతిని నమ్మనని పేర్కొన్నాడు. 'నేను ఆటగాళ్లను అస్సలు తిట్టను. ఎందుకంటే మన సంస్కృతిలో టీచర్లు, కోచ్‌లు తమ విద్యార్థులను తిట్టడం, కొట్టడం సాధారణం. కానీ, వీటిని నేను నమ్మను. ఆటగాళ్లను గౌరవిస్తాను. కోచ్ అనేవాడు ఆటగాళ్లకు ఏదైనా సహాయం కావాలంటే చేయాలి. వారి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి సలహాలు ఇవ్వాలి. నేను ఆటగాళ్లను నిందించను' అని అకీబ్ జావేద్ అన్నాడు.

# ప్రాక్టీస్‌కు దూరంగా రోహిత్, శుభ్‌మన్

ఛాంపియన్స్ ట్రోఫీలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించిన టీమ్ఇండియా సెమీస్‌కు దూసుకెళ్లింది. అదే ఊపును ఆదివారం (మార్చి 2) న్యూజిలాండ్‌తో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లోను కొనసాగించాలను కుంటోంది. ఈ మ్యాచ్ కోసం టీమ్ఇండియా బుధవారం ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంది. అయితే, కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం సాధనకు దూరంగా ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. ఐసీసీ అకాడమీలో భారత ఆటగాళ్లు ఫుట్‌బాల్, రన్నింగ్ చేసి చెమటోడ్చుతుండగా, రోహిత్ మాత్రం కఠినమైన శారీరక కసరత్తులకు దూరంగా ఉన్నాడట. అతను స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ సోహం దేశాయ్ పర్యవేక్షణలో మెల్లగా జాగింగ్ చేసినట్లు తెలుస్తోంది. కానీ, రోహిత్ స్వేచ్ఛగా కదలడం లేదని జాతీయ మీడియాలో వార్తలొస్తున్నాయి. భారత కెప్టెన్ ఎలాంటి త్రో డౌన్లు ఎదుర్కోకుండా కేవలం షాడో బ్యాటింగ్ చేస్తూ హెడ్ కోచ్ గంభీర్, ఇతర కోచింగ్ సిబ్బందితో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత కెప్టెన్ తొడ కండర గాయంతో బాధ పడ్డాడు. అయితే తాను బాగానే ఉన్నానని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పాక్‌తో మ్యాచ్ అనంతరం చెప్పాడు.

### శుభ్‌మన్ గిల్ కూడా..

ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్ కూడా ప్రాక్టీస్ సెషన్‌కు హాజరుకాలేదని సమాచారం. అతను హొటల్ రూమ్‌కే పరిమితమైనట్లు



తెలుస్తోంది. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేసిన గిల్ అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. రిషభ్ పంత్ జ్వరం నుంచి కోలుకొని బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఆటగాళ్ల ఫిట్‌నెస్ ఆందోళనల దృష్ట్యా న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో టీమ్ఇండియా తుది జట్టులో మార్పులు ఉండే అవకాశం ఉంది. కొంతమంది ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చి ఇప్పటివరకు ఛాన్స్ రాని ప్లేయర్లను ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకోవచ్చు. టోర్నీలో మొదటి రెండు మ్యాచ్‌ల్లో భారత్ ఒకే తుది జట్టుతో ఆడిన సంగతి తెలిసిందే.

### ఢిల్లీ క్యాపిటల్స్ మెంటార్‌గా
## ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్

ఐపీఎల్-2025 ముం గిట ఢిల్లీ క్యాపిటల్స్ కీల క ప్రకటన చేసింది. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్‌ను మెం టార్‌గా నియమించింది. ఈ మేరకు గురు వారం డీసీ సామాజిక మాధ్య మాల్లో ప్రకటన చేసింది. హెడ్ కోచ్ హేమంగ్ బాదానీతో కలిసి పీటర్సన్ పనిచేయనున్నాడు. ఐపీఎల్‌లో పీటర్సన్ మెంటార్‌గా వ్యవహరించడం ఇదే తొలిసారి. ఈ ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ 2009, 2010, 2012, 2014, 2016 సీజన్లలో ఐపీఎల్‌లో ఆడాడు. 2012- 2014 మధ్య ఢిల్లీకి ప్రాతినిధ్యం వహించాడు. 2014లో డీసీకి నాయకత్వం వహించాడు. కానీ, ఆ సీజన్‌లో ఢిల్లీ రెండే విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. వచ్చే సీజన్‌లో ఛాంపియన్‌గా జట్టును ఛాంపియన్‌గా నిలపడమే లక్ష్యంగా ఢిల్లీ క్యాపిటల్స్ తమ కోచింగ్ స్టాఫ్‌ను మార్చేసింది. రికీ పాంటింగ్ స్థానంలో భారత మాజీ ఆటగాడు హేమంగ్ బదానీని హెడ్ కోచ్‌గా నియమించింది. బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లోనూ కోచ్‌లను మార్చింది. అయితే, ఐపీఎల్ 2025 కోసం ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఎవరుంటారనే ఇంకా ఫ్రాంఛైజీ ప్రకటించలేదు. కొత్తగా జట్టులోకి తీసుకున్న కేఎల్ రాహుల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

# ధోనీకి ఇదే చివరి ఐపీఎల్..?

### క్లారిటీ ఇచ్చిన మాజీ కెప్టెన్..!

భారత జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ చెన్నైకి చేరుకున్నాడు. మార్చిలో మొదలవనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025 కోసం డెన్‌కు చేరుకున్నాడని ఫ్రాంచైజీ పేర్కొంది. అయితే, ధోనీకి ఇదే చివరి ఐపీఎల్ అనే చర్చ సాగుతున్నది. ఈ విషయంలో మాజీ కెప్టెన్ సైతం క్లారిటీ ఇచ్చాడని పలువురు అభిమానులు పేర్కొంటున్నారు. ధోనీ తాను వేసుకున్న టీ షర్ట్‌తోనే.. తనకు ఇదే ఆఖరి ఐపీఎల్ అనే సందేశం ఇచ్చినట్లుగా పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. ఐపీఎల్ కోసం చెన్నైకి ధోనీ చేరుకున్నాడు. పటిష్ట భద్రత మధ్య విమానాశ్రయంలో నుంచి వస్తుండగా.. అందరి దృష్టి ధోనీ వేసుకున్న టీ షర్ట్‌పై ఉంది. ఆ టీ షర్ట్‌పై ఉన్న డిజైన్‌లో మోర్స్ కోడ్ ఉందని.. దానికి 'చివరిసారి' అని అర్థం చెబుతూ.. ధోనీకి ఇదే చివరి ఐపీఎల్ అంటూ సోషల్ మీడియాలో హాట్ చర్చ సాగుతున్నది. ఇదిలా ఉండగా.. ఇటీవల జియో హాట్‌స్టార్‌లో నటుడు సన్నీ డియోల్‌తో కలిసి చాంపియన్స్ ట్రోఫీలో భారత్-పాక్ మ్యాచ్‌ను చూశాడు. అంతకు ముందు సంజు సామ్సన్‌తో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఫిట్‌గా ఉండేందుకు.. రెండునెలల ఐపీఎల్‌కు కోసం సిద్ధంగా ఉండేందుకు చాలా కష్టపడాల్సి ఉంటుందని ధోనీ పేర్కొన్నాడు. తాను సంవత్సరానికి కొన్ని నెలలు మాత్రమే ఆడుతానని.. కానీ, తొలిసారి ఎలాగైతో ఆడానో.. అదే తరహాలోనే ఆస్వాదించాలనుకుంటున్నానని చెప్పాడు. గత ఆరు నుంచి ఎనిమిది నెలలు కష్టపడాల్సి ఉంటుందని.. ఎందుకంటే ఐపీఎల్ అత్యంత క్లిష్టమైన టోర్నీల్లో ఒకటని పేర్కొన్నాడు. మీ వయసు ఎంత అని ఎవరూ పట్టించుకోరని.. మీ వయసు ఎంత అయినా.. లీగ్‌లో స్థాయి తగ్గకూడదని.. అందుకే తన శారీరక, మానసిక దృఢత్వాన్ని మెరుగుపరుచుకునేందుకు తాను నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. దేశం తరఫున ఆడడం తన కెరీర్‌లో ప్రేరణ అని పేర్కొన్నాడు. తాను పెద్దగా క్రికెట్‌కు గుర్తింపు లేని రాష్ట్రం నుంచి వచ్చానని.. తనకు ఒకసారి అవకాశం వచ్చినప్పుడు.. దేశానికి ప్రాతినిధ్యం వహించినప్పుడు తనకు గొప్ప గౌరవంగా అనిపించిందని ధోనీ పేర్కొన్నాడు. తనకు అవకాశం వచ్చిన తర్వాత మ్యాచ్‌లో గెలవడానికి ప్రయత్నిస్తున్న గెలిచే జట్టులో భాగం కావాలని కోరుకున్నానని.. అది పెద్ద టోర్నీ అయినా.. ద్వైపాక్షిక సిరీస్ అయినా.. మేము ఓ జట్టుగా గెవడానికి ప్రయత్నించామని చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యానని.. కానీ క్రికెట్‌పై ప్రేమ ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉందని ధోనీ వివరించాడు.



# ఇన్ఫీలో బలవంతపు లేఆఫ్‌లు..

### పీఎంఓకు ట్రైనీల ఫిర్యాదు..

ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఇటీవల మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ కంపెనీకి చెందిన మైసూరు క్యాంపస్‌లో దాదాపు 400 మంది ట్రైనీ ఉద్యోగులను విధుల్లో నుంచి తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై కార్మిక యూనియన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా ఈ వ్యవహారం ప్రధానమంత్రి కార్యాలయానికి చేరింది. ఈ బలవంతపు లేఆఫ్‌లపై ట్రైనీలు పీఎంఓకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తొలగింపులపై ప్రధానమంత్రి కార్యాలయంలో 100కు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు సదరు కథనాలు తెలిపాయి. ఈ విషయంలో జోక్యం చేసుకుని తమ ఉద్యోగాలను తిరిగి ఇప్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి తొలగింపులు జరగకుండా చూడాలని ట్రైనీలు కోరినట్లు తెలుస్తోంది. దీంతో కేంద్ర కార్మిక శాఖ స్పందించి చర్యలు




చేపట్టినట్లు సమాచారం. దీనికి సంబంధించి కర్ణాటక కార్మిక శాఖకు ఫిబ్రవరి 25నే నోటీసులు పంపించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర కార్మిక శాఖ అధికారులు దర్యాప్తు జరిపి కేంద్రానికి నివేదిక ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి ఆరంభంలో మైసూరు క్యాంపస్‌లోని దాదాపు 400 మందిని ట్రైనీలకు ఇన్ఫోసిస్ లేఆఫ్‌లు ప్రకటించింది. ఉన్నపళాన క్యాంపస్‌ను వీడాలని అల్టిమేటం జారీ చేసినట్లు వార్తలు వచ్చాయి. , దీనిపై ఇన్ఫోసిస్ ఆ తర్వాత స్పందించింది. వరుసగా మూడు ఎవాల్యుయేషన్ పరీక్షల్లో విఫలమవడంతో వారిని తొలగించినట్లు వెల్లడించింది. ఈ పరీక్షలు సంస్థ నిబంధనల్లో భాగమేనని, కంపెనీ పురోగతికి కూడా ముఖ్యమని పేర్కొంది. 2022-23 నియామక ప్రక్రియలో భాగంగా 2000 మంది ఫ్రెషర్లను ఇన్ఫోసిస్ ఎంపిక చేసింది. సిస్టమ్ ఇంజినీర్, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజినీర్ తదితర పోస్టులకు ఎంపిక చేస్తూ, వారికి అదే ఏడాది ఆఫర్ లెటర్లు ఇచ్చింది. వారంతా 2022 బ్యాచ్ ఉత్తీర్ణులు. అన్ని రకాల పరీక్షలను పూర్తి చేసినా వీరిని విధుల్లోకి తీసుకోవడంలో మాత్రం ఆలస్యం చేస్తూ వచ్చారు. దీంతో కంపెనీపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో పాటు కార్మిక శాఖ వద్ద ఫిర్యాదు సైతం నమోదైంది. ఈ క్రమంలో రెండేళ్లు ఆలస్యంగా 2024 ఏప్రిల్‌లో వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంది. అయితే, గతేడాది మైసూరు క్యాంపస్‌లో ట్రైనీలుగా చేరిన వారిలో సగం మందిపై ఇన్ఫోసిస్ వేటు వేయడం గమనార్హం.

### టిక్‌టాక్‌కు పోటీగా ఇన్‌స్టా రీల్స్ కోసం ప్రత్యేక యాప్



టిక్‌టాక్ స్ఫూర్తితో ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్‌ను తీసుకొచ్చిన మెటా సంస్థ.. ఇప్పుడు ఆ సంస్థకు పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇన్‌స్టా రీల్స్ కోసమే ప్రత్యేకంగా యాప్‌ను తీసుకురావాలని చూస్తోంది. ఇన్ స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మొస్సేరి ఇప్ప టికే ఈ విషయాన్ని తమ సిబ్బందికి తెలిపినట్లు సమచారం. అంతేకాదు.. రీల్స్‌లో 3 నిమిషాల వీడియోలు కూడా చూపిం చనున్నట్లు తెలుస్తోంది. ఇది కూడా టిక్‌టాక్ తరహాలోనే వర్టిక ల్‌గా స్క్రోల్ కానుంది. అమెరికాలో టిక్‌టాక్ ఇటీవల నిషేధం ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టాక పునరుజ్జీవం పోసుకుంది. ఇప్పటికీ నిషేధం కత్తి వెంటాడు తోంది. టిక్‌టాక్ మాతృ సంస్థ బైట్‌డ్యాన్స్‌లో 50 శాతం వాటాను అమెరికా సంస్థకు అమ్మేస్తే దానికి అనుకూలంగా నిర్ణయం ఉంటుందని ట్రంప్ స్పష్టంచేశారు. ఏప్రిల్ 5లోగా దాని భవితవ్యం తేలనుంది. ఈ క్రమంలో కొత్త యాప్ గురించి ఇన్‌స్టా ఆలోచన చేస్తుండడం గమనార్హం.




## వైర్ షేర్లకు 'అల్ట్రా' షాక్..
### 20 శాతం మేర పతనం

ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్.. వైర్లు, కేబుళ్ల విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించడంతో ఆ రంగంలో ఉన్న కంపెనీల షేర్లు గురువారం కుదుపునకు లోనయ్యాయి. మార్కెట్‌లో ఇప్పటికే ప్రధాన ప్లేయర్లుగా ఉన్న పాలిక్యాబ్ ఇండియా లిమిటెడ్, కేఈఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఆర్‌ఆర్ కేబుల్ లిమిటెడ్, హావెల్స్ ఇండియా లిమిటెడ్ తదితర కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రధాన కంపెనీలన్నీ ఒక్కరోజులోనే రూ.35,500 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయాయి. బిర్లా ఓపస్ బ్రాండు ద్వారా గతేడాది డెకరేటివ్ పెయింట్ల విభాగంలోకి ఆదిత్య బిర్లా గ్రూపు అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. స్థిరాస్తి, వాణిజ్య, మౌలికం, పారిశ్రామిక రంగం సహా వివిధ రంగాల్లో వైర్లు, కేబుళ్లకు పెరుగుతున్న గిరాకీ అవకాశాలను అందిపుచ్చుకునే లక్ష్యంతోనే ఆ విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు అల్ట్రాటెక్ సిమెంట్ తాజాగా ప్రకటించింది. ఇందుకోసం గుజరాత్‌లో ప్లాంటు ఏర్పాటు చేసే నిమిత్తం రాబోయే రెండేళ్లలో రూ.1,800 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేఈఐ ఇండస్ట్రీస్ అత్యధికంగా 21 శాతానికి పైగా పతనమైంది. ఎన్ఎస్ఈలో కంపెనీ షేరు విలువ ఒక్కరోజే రూ.800 మేర క్షీణించి రూ.2989 వద్దకు చేరింది. ఆర్‌ఆర్ కేబుల్ లిమిటెడ్ షేరు విలువ దాదాపు 20 శాతనమై రూ.892 వద్ద ముగిసింది. పాలిక్యాబ్ 18 శాతం, హావెల్స్ 7 శాతం, ఫినోలెక్స్ 2 శాతం చొప్పున నష్టపోయాయి. అల్ట్రాటెక్ ఎంట్రీ వల్ల పోటీ వాతావరణం నెలకొంటుందన్న భయాలు అమ్మకాలకు కారణమయ్యాయని అనలిస్టులు చెబుతున్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ షేర్లు సైతం ఇంట్రాడేలో 6 శాతం మేర నష్టపోయాయి. చివరికి 4 శాతం నష్టంతో రూ.10,450 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో అల్ట్రాటెక్ మార్కెట్ విలువ రూ.20వేలు కోట్ల మేర క్షీణించింది. కొత్త వ్యాపారంలోకి అడుగుపెడుతుండడంతో రిస్క్ ఉండొచ్చన్న అంచనాలు మదుపర్లలో భయాందోళనకు కారణమయ్యాయి. ప్రస్తుతం సిమెంట్ రంగంలో అగ్రగామిగా ఉన్న అల్ట్రాటెక్ ప్రధాన వ్యాపారంపై తాజా నిర్ణయం ప్రభావం చూపుతుందన్న ఆందోళనలూ వ్యక్తమయ్యాయి.

## గూగుల్‌లో ఉద్యోగాల కోత..




ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ తాజాగా ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ చేపట్టింది. క్లౌడ్ డివిజన్‌లోని ఉద్యోగుల సంఖ్య ను తగ్గించిందని సమాచారం. సంబంధిత వ్యక్తులు ఈ విష యాన్ని వెల్లడించినట్లు బ్లూమ్ బర్గ్ తన కథనంలో పేర్కొంది. అయితే ఎంతమందిని తొలగిం చిందనే విషయం మాత్రం తెలియరాలేదు. వంద మందికి పైగా ఉండొచ్చని, అది కూడా కొన్ని టీమ్స్‌పై మాత్రమే తొల గింపుల ప్రభావం ఉందని తెలుస్తోంది. "కంపెనీ దీర్ఘకాలిక విజయాల కోసం వ్యాపారానికి కీలకమైన రంగాల్లో పెట్టుబడులు పెంచేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. అందులోభాగంగా కొన్ని మార్పులు చేస్తున్నాం" అని గూగుల్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో అవకాశాల్ని అందిపుచ్చుకొనేందుకు అనేక సర్దుబాట్లు చేశామని వెల్లడించారు. మరోవైపు ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో గూగుల్ తన క్లౌడ్ వ్యాపారంలో ఆదాయ అంచనాలను అందుకోలేక పోయింది. 2025 మూలధన వ్యయాలు కూడా అంచనాలకు మించిపోయాయి. ఈనేపథ్యంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం గమనార్హం.

# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు





**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రకటనలు ఇప్పటికే మదుపర్లలో విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఈ క్రమంలో మార్కెట్ గమనంపై అనిశ్చితి నెలకొనడంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో సూచీలు రోజంతా ఓ మోస్తరు శ్రేణిలోనే కదలాడాయి. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించగా.. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీల్లో మాత్రం అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 74,706.60 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,602.12) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా స్వల్ప శ్రేణిలో లాభనష్టాల మధ్య కదలాడింది. ఇంట్రాడేలో 74,520.78-74,834.09 పాయింట్ల మధ్య చలించిన సూచీ.. చివరికి 10.31 పాయింట్ల లాభంతో 74,559.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 2.50 పాయింట్లు నష్టపోయి 22,545.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.21గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, జొమాటో, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, టెక్ మహీంద్రా షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 73.22 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2901 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.





# ‘కన్నప్ప’ నాలో మార్పు తెచ్చింది



మంచు విష్ణు హీరోగా నటిస్తోన్న సరికొత్త చిత్రం ‘కన్నప్ప’. ముకేశ్ కుమార్‌సింగ్ దర్శకుడు. ప్రీతి ముకుందన్ కథనా యికగా నటిస్తున్నారు. ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ శివుడిగా కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రం హిందీ టీజర్ లాంఛ్ ఈవెంట్‌లో అక్షయ్‌కుమార్‌పై మంచు మనోజ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శివుడి గురించి ఈ తరంలో ఎవరు ఆలోచించినా అక్షయ్‌కుమార్ రూపమే గుర్తుకువస్తుందన్నారు. మీడియా వాళ్ల కోసం ప్రత్యేకంగా దీని హిందీ టీజర్‌ను లాంఛ్ చేశారు. “నేను మోహన్‌బాబు కుమారుడిని అని చెప్పడానికి గర్వపడతాను. ఆయన లేకపోతే నేను నటుడిని అయ్యేవాడిని కాదు. ఆయన కార ణంగానే అక్షయ్ కుమార్ కూడా ఈ చిత్రంలో నటించారు. చిత్రీకరణ సమయంలో అక్షయ్ నుంచి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. ఈ చిత్రంలో చేసిన ప్రతిఒక్కరూ వారి పాత్రలకు వందశాతం న్యాయం చేశారు. ఈ చిత్రీకరణ ప్రారంభం అయ్యాక నాలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఉన్నతంగా ఆలోచిస్తున్నా. మోహన్‌లాల్, ప్రభాస్ అందరూ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు. ఈ తరంలో శివుడు అంటే మొదట గుర్తుకువచ్చే పేరు అక్షయ్‌కుమారే” అని విష్ణు చెప్పారు.

## ‘సుడల్ సీజన్-2’ స్ట్రీమింగ్‌కు రెడీ..

తమిళ ప్రేక్షకులనే కాదు, ఇతర భాషల సినీ అభిమానులకు థ్రిల్ పంచిన వెబ్‌సిరీస్ ‘సుడల్: ది వొర్టెక్స్’. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా వచ్చిన ఈ సిరీస్ తమిళంతో పాటు, 30 భాషల్లో విడుదలైంది. కథిర్, ఐశ్వర్యా రాజేశ్, ఆర్.పార్తిబన్, హరీశ్ ఉత్తమన్, శ్రియారెడ్డి కీలకపాత్రల్లో రూపొందిన క్రైమ్ థ్రిల్లర్‌ను ‘పుష్కర్-గాయత్రి’ క్రియేట్ చేయగా, బ్రహ్మ జి - అనుచరణ్ మురుగేయాన్ దర్శకత్వం వహించారు. దీనికి కొనసాగింపుగా ఇప్పుడు ‘సుడల్: సీజన్2’ ఈ శుక్రవారం (ఫిబ్రవరి 28) నుంచి స్ట్రీమింగ్ కానుంది. తొలి భాగంలో ఏం జరిగింది. అంతలా హిట్ కావడానికి కారణమేంటి? సీజన్-2లో ఏం చూపించ

## సూర్య కంటే విజయ్ బెటర్ అంటూ ట్రోల్స్..

### జ్యోతిక రియాక్షనిదే..

ఇండస్ట్రీలోని అందమైన జోడీల్లో సూర్య-జ్యోతికల జంట ఒకటి. సందర్భం వచ్చినప్పుడల్లా వీరిద్దరూ పరస్పరం ఒకరిపై ఒకరు ప్రేమను వ్యక్తపరుస్తుం టారు. తన తాజా వెబ్ సిరీస్ ‘డబ్బా కార్టెల్’ ప్రచారంలో బిజీగా ఉన్న జ్యోతిక.. సూర్యను ఉద్దేశించి వస్తోన్న ట్రోల్స్‌పై స్పందిం చారు. తాజాగా జ్యోతిక తన లేటెస్ట్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అయితే ఈ ఫొటో కామెంట్ సెక్షన్‌లో కొందరు నెటిజన్లు సూర్యను ఉద్దేశిస్తూ కామెంట్స్ పెట్టారు. ఇటీవల వచ్చిన ప్రదీప్ రంగనా థ్ సినిమా కలెక్షన్లను సూర్య సినిమా వసూళ్లతో పోలుస్తూ ట్రోల్ చేశారు. అలాగే సూర్య కంటే కోలీవుడ్ హీరో విజయ్ బెటర్ అంటూ ఓ నెటిజన్ కామెంట్ పెట్టారు. దీనికి జ్యోతిక స్పందిస్తూ.. హాస్యాస్ప దంగా ఉంద నే అర్థం వచ్చేలా నవ్వు ఎమోజీని పెట్టారు. ప్రస్తుతం ఆమె రిప్లై గా మారింది. ఇక జ్యోతిక ప్రధాన పాత్రలో నటించిన వెబ్ సిరీస్ ‘డబ్బా కార్టెల్’. నెట్‌ఫ్లిక్స్‌లో ఫిబ్రవరి 28వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. బాలీవుడ్ సీనియర్ నటి షబానా అజ్మీ కీలకపాత్రలో నటించారు. హితేశ్ భాటియా దర్శకుడు. మధ్యతరగతికి చెందిన ఐదుగురు మహిళలు.. డబ్బా సర్వీసు ముసుగులో డ్రగ్స్‌ను సరఫరా చేస్తుంటారు. ఈక్రమంలో వీరు ఎలాంటి సమస్యల్లో చిక్కుకున్నారనే కథాంశం ఆధారంగా దీన్ని రూపొందించారు. సూర్య ప్రస్తుతం ‘రెట్రో’లో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల విడుదలైన దీని టీజర్‌కు మంచి స్పందన వచ్చింది.



## పుట్టబోయే పిల్లల గురించి కూడా అలాంటి కామెంట్స్ చేస్తున్నారు : ప్రియమణి

యంగ్ హీరోయిన్‌లకు పోటీగా అగ్ర హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్నారు నటి ప్రియమణి. టాలీవుడ్, బాలీవుడ్‌లలో బిజీగా మారారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. వివాహం చేసుకున్నప్పటినుంచి కొందరు ప్రజలు తనను విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. తనకు పుట్టబోయే పిల్లల గురించి కూడా కామెంట్స్ చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. 2017లో ముస్తాఫారాజ్‌తో ప్రియమణి ఏడడుగులు వేసిన విషయం తెలిసిందే. 2016లో వీరి నిశ్చితార్థం జరిగిన నాటినుంచి ఆన్‌లైన్ వేదికగా విమర్శలు ఎదురవ్వడం ప్రారంభమయ్యాయని ప్రియమణి అన్నారు. “నాకు ఎంగేజ్‌మెంట్ జరగ్గానే నా మనుషులంతా ఆనందిస్తారని అనుకున్నాను. వారితో ఈ సంతోషకరమైన క్షణాలను పంచుకోవాలనుకున్నా. కానీ, అప్పటినుంచి నాపై అనవసరమైన ద్వేషం ప్రారంభమైంది. లవ్ జిహాద్ ఆరోపణలు వచ్చాయి. పిల్లలు పుట్టాక వారిని ఐసిస్‌లో జాయిన్ చేస్తారా అంటూ కామెంట్స్ పెడుతున్నారు. అవి ఎంతగానో బాధ పెడుతున్నాయి. నేను మీడియా పర్సన్‌ను కాబట్టి అలాంటివాటిని పట్టించుకోను. కానీ, నా భర్తపై అలాంటి కామెంట్స్‌తో ఎందుకు దాడి చేస్తున్నారు. అతడి గురించి వివరాలు కూడా మీకు తెలియవు. కానీ, కామెంట్స్ మాత్రం చేసేస్తారు. ఇప్పటికీ కూడా నేను నా భర్తతో దిగిన ఫొటోను పోస్ట్ చేస్తే.. పదిలో తొమ్మిది కామెంట్స్ మా వివాహం మీదనే ఉంటాయి. వాటివల్ల బాధపడాల్సి వస్తోంది” అని ప్రియమణి అన్నారు.



## ‘సంక్రాంతికి వస్తున్నాం’

### ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ కూడా ఫిక్స్..

ఓటీటీలోకి వచ్చాక టెలివిజన్‌లో ప్రసారం చేయడం సర్వ సాధారణంగా జరిగేదే. కానీ, అందుకు భిన్నంగా ‘సంక్రాంతి వస్తున్నాం’ చిత్రాన్ని మొదటగా ఓటీటీ కన్నా కూడా జీ తెలుగు టెలివిజన్‌లో ప్రసారం చేస్తున్నట్లు ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సంక్రాంతికి కానుకగా వచ్చిన ఈ సినిమా ప్రచారం కూడా వైవిధ్యంగా చేశారు. అందుకు తగినట్లుగానే ఈ నిర్ణయం తీసుకున్నారని అందరూ అనుకున్నారు. ఇప్పుడు ఓటీటీ స్ట్రీమింగ్ తేదీని కూడా జీ5 చెప్పేసింది. మార్చి 1వ తేదీ సాయంత్రం 6గంటల అటు జీ తెలుగులోనూ ఇటు జీ5 ఓటీటీలోనూ ఒకేసారి ‘సంక్రాంతికి వస్తున్నాం’ అందుబాటులోకి రానుంది. జీ5 తాజాగా తన యాప్‌లో విడుదల చేసిన సరికొత్త ప్రోమోలో ఈ విషయాన్ని తెలియజేసింది. మరి ఓటీటీలో చూడలేమా? అని దిగులు పడుతున్న వారికి శుభవార్త చెప్పినట్లైంది. వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఫుల్ రన్‌లో దాదాపు రూ.300 కోట్లు (గ్రాస్)పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. మరోవైపు ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. థియేటర్‌లో ఈ సినిమా నిడివి కారణంగా కొన్ని కామెడీ సన్నివేశాలను అనిల్ రావిపూడి తొలగించారట. తాజాగా ఓటీటీ వెర్షన్‌లో ఆ సన్నివేశాలన్నిటినీ యాడ్ చేయాలని భావిస్తున్నారని సమాచారం. మార్చి 1న స్ట్రీమింగ్ కానున్న వెర్షన్‌లో ఉంచుతారేమో చూడాలి.. సినిమా ఫ్లాష్‌బ్యాక్‌లో మీనాక్షి చౌదరి, వెంకటేశ్‌ల మధ్య కొన్ని కామెడీ సీన్స్‌ను యాడ్ చేయనున్నారు. ఈ సీన్స్ సినిమాకు మరింత బలాన్నిస్తాయని టీమ్ భావిస్తోంది. అలాగే మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్‌ల మధ్య కూడా మరికొన్ని సన్నివేశాలు కలపనున్నారట. ఈ విషయంపై టీమ్ అధికారిక ప్రకటన చేయకపోయినా, ఇటీవల ‘పుష్ప2’ సహా పలు చిత్రాల ఓటీటీ వెర్షన్స్‌లో అదనపు సన్నివేశాలను జోడించి అందుబాటులోకి తెచ్చారు.

## రజనీకాంత్ చిత్రంలో పూజా హెగ్డే..

రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ ‘కూలీ’. నాగార్జున, శ్రుతిహాసన్, సత్యరాజ్, ఉపేంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఆ సినిమాలో పూజా హెగ్డే నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఇందులో పూజా భాగం అయినట్లు టీమ్ తెలిపింది. ఈ చిత్రబృందం ఇటీవల ఓ ప్రీ లుక్ పోస్టర్ విడుదల చేసి ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టాలంటూ పోస్ట్ పెట్టింది. తాజాగా ఆ ప్రీ లుక్ పోస్టర్ పూజా హెగ్డేదేనంటూ కన్ఫార్మ్ చేసింది. అయితే పూజా ఇందులో కీలక పాత్రలో నటించనున్నారా, లేదంటే స్పెషల్ సాంగ్‌లో కనిపించనున్నారా అనేది తెలియాల్సి ఉంది. అనిరుధ్ ఈ సినిమాకు ‘జైలర్’లోని “కావాలయ్యా” పాట తరహాలో ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. దీనికోసం పూజా హెగ్డేను ఎంపిక చేశారని అభిమానులు భావిస్తున్నారు. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో.. రజనీ మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఆమిర్‌ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టులో థియేటర్లలోకి వచ్చే అవకాశముంది.

## ‘కుబేర’ రిలీజ్ డేట్ వచ్చేసింది

### ఆసక్తికర పోస్టర్ షేర్ చేసిన టీమ్



వరుస సినిమాలతో జోష్ మీదున్న రష్మిక తాజాగా మరో సినిమాతో అలరించేందుకు సిద్ధమయ్యారు. అగ్ర హీరోలు నాగార్జున, ధనుష్‌లతో కలిసి ‘కుబేర’ అంటూ పలకరించ నున్నారు. శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. తాజాగా దీని విడుదల తేదీని తెలుపుతూ ఓ ఆసక్తికర పోస్టర్‌ను టీమ్ షేర్ చేసింది. జూన్ 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పంచుకున్న పోస్టర్‌లో నాగార్జున, ధనుష్‌లు ఎదురెదురుగా ఉండగా మధ్యలో బాలీవుడ్ నటుడు జిమ్ షర్భ్ కనిపిస్తున్నారు. ఇదొక భిన్నమైన సోషల్ డ్రామా కథాంశంతో తెరకెక్కుతున్నట్లు అర్థమవుతోంది. ఇందులో ధనుష్ మునుపెన్నడూ చేయని కొత్త పాత్రలో కనిపించనున్నారు. రాజకీయాంశాలకూ ఇందులో పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. పైకి బిచ్చగాడిగా (ధనుష్) కనిపిస్తున్న వ్యక్తి ఎవరు? అతను ఎందుకు అలా మారాల్సి వచ్చింది? అతని నేపథ్యం ఏంటన్నది ఆసక్తికరంగా చూపించబోతున్నారు. నాగార్జున ఇందులో ఈడీ అధికారి పాత్ర పోషిస్తున్నట్లు టాక్. రష్మిక నటించిన వరుస సినిమాలు హిట్ అవుతున్న నేపథ్యంలో ‘కుబేర’పై అభిమానులు అంచనాలు పెట్టుకున్నారు. అగ్ర కథానాయకులు నటిస్తుండడం.. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వస్తుండడంతో ఈ సినిమా కోసం ఆడియన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందులో రష్మిక పాత్ర గురించి శేఖర్ కమ్ముల మాట్లాడుతూ.. “మీ పక్కంటి అమ్మాయిగా రష్మిక కనిపిస్తారు. ఇప్పటివరకూ రష్మిక, ధనుష్ కలిసి నటించడం చూడలేదు. ఇందులో వారి స్క్రీన్ ప్రజెన్స్ చాలా కొత్తగా ఉంటుంది” అని అన్నారు.

Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**